PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 173 | విజయవాడ, ఆదివారం 28 జనవరి 2024 | 6+8 పేజీలు + స్నేహ వెల : 7.00
Vol No | Vijayawada, Sunday 28 January 2024 | Rs

బిజెపిలోకి వస్తే పాతిక కోట్లు
- ఏడుగురు ఆప్ ఎమ్మెల్యేలతో బేరసారాలు
- ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సంచలన ఆరోపణ

5

చరిత్ర సృష్టించిన రోహన్ బోపన్న
- 43ఏళ్ల వయసులో ఆస్ట్రేలియన్ ఓపెన్ డబుల్స్ టైటిల్
- మహిళల సింగిల్స్ టైటిల్స్ సబలెంక కైవసం

6

ఎన్నికల యుద్ధ బాణాలు
సంక్షేమ పథకాలే
- ప్రతి ఇంటి నుండి స్టార్ క్యాంపెయినర్ రావాలి
- 'సిద్ధం' సభలో సిఎం జగన్

ఎన్నికల సమరశంఖం పూరిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

పొత్తులు పెట్టుకోకపోతే రాష్ట్రంలోని ఆ రెండు పార్టీలకూ అభ్యర్థులే లేరని టిడిపి, జనసేన పార్టీలను ఉద్దేశించి రాష్ట్ర ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రతి ఇంటి నుంచి వైసిపికి స్టార్ క్యాంపెయినర్ రావాలని కోరారు. విశాఖ జిల్లా భీమునిపట్నం నియోజకవర్గం సంగివలస వద్ద శనివారం జరిగిన వైసిపి ఉత్తరాంధ్ర క్యాడర్ సభలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే ప్రతిపక్షాలపై యుద్ధ బాణాలుగా మారాలంటూ ఎన్నికల నగారా మోగించారు. 'ఎన్నికలకు నేను సిద్ధం. మీరు సిద్ధమా? అంటూ పదేపదే కార్యకర్తలతో చప్పట్లు కొట్టిస్తూ వేదిక పైనుంచే సమర శంఖం పూరించారు. వచ్చే 70 రోజులూ నిత్యం యుద్ధమేనని, మీరంతా సిద్ధంగా ఉండాలని కార్యకర్తలను కోరారు. 'సుపరిపాలనలో మనమెక్కడ.. చంద్రబాబెక్కడ? ఆయనది దుర్మార్గపు చరిత్ర. 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు మార్క్ ఎక్కడైనా ఉందా? 2014 ఎన్నికల్లో గెలిచాక అభివృద్ధి, సంక్షేమాన్ని చాపచుట్టేసి రాష్ట్రానికి పెద్ద సున్నా చూపించాడు. గడిచిన 56 నెలల వైసిపి పాలనలో జరిగిన సంక్షేమం దేశంలో ఎక్కడా జరగలేదు. రూ.2.53 లక్షల కోట్ల సంక్షేమ పథకాలకు బటన్ నొక్కాం. నేను మీకు (కార్యకర్తలకు), ప్రజలందరికీ మంచి 'సేవకుడను' అని అన్నారు. ఆ రెండూ జనంలోలేని దిగజారుడు పార్టీలని, ఆ నాయకులు పెత్తందారీ వర్గానికి ప్రతినిధులని చంద్రబాబు, పవన్‌ను ఉద్దేశించి విమర్శించారు. వీరంతా కలసి ప్రభుత్వంపై తప్పుడు ప్రచార ఆయుధాలతో దాడికి వస్తున్నారని, ఒంటరిగా ఎదుర్కొనడానికి తాను సిద్ధమని ప్రకటించారు. ప్రతి ఇంటికీ, ప్రతి గ్రామానికీ తన పాలనలో సంక్షేమం అందిందని, 60 శాతం ప్రజలు తమతోనే ఉన్నారని అన్నారు. ప్రతి ఇంటి నుంచీ ఒక స్టార్ క్యాంపెయినర్ వైసిపి కోసం వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. చెడిపోయిన రాజకీయ వ్యవస్థలో 2019లో గెలిచాక తాను మార్పు తెచ్చానని, వివక్ష, లంచాల్లేని పాలన అందిస్తున్నానని అన్నారు. రానున్న ఎన్నికలు పేదరికం నుంచి ప్రజలను బయటకు తెచ్చేవని, చదువుకునే పిల్లల తలరాతలు మార్చేవని పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ 12 గ్యాస్ సిలిండర్లు ఇస్తానని, బ్యాంకుల్లో దాచుకున్న బంగారం విడిపిస్తానని చెప్పి 2014లో చంద్రబాబు చెప్పారని, గెలిచాక ఈ హామీలను అమలు చేయలేదని అన్నారు.

కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకూ మార్పు తెచ్చాం

తమ ప్రభుత్వంలో కుప్పం మొదలుకుని ఇచ్ఛాపురం వరకూ అవినీతి, లంచం, వివక్షలేని పౌరసేవలు అందించి, సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఈ కాలంలో చేరువయ్యామని జగన్ అన్నారు. 2019లో వారికొచ్చిన 23 స్థానాలు కూడా ఈసారి వారికి రావన్నారు. 75 రోజుల్లో జరిగే ఎన్నికల యుద్ధం అబద్ధానికీ.. నిజానికీ, టిడిపి మోసానికీ.. వైసిపి విశ్వసనీయతకూ మధ్య సాగే యుద్ధమని పేర్కొన్నారు. బాబుకు ఓటేయాలని ఎవరైనా అనుకుంటే సంక్షేమ పథకాలను రద్దు కోరుకునేవాళ్లేనని అన్నారు.

జనం మధ్యకు జగన్

సంగివలసలో జరిగిన సభలో ఇరువైపులా క్యాడర్‌కు అభివాదం చేస్తూ వారిని దగ్గర్నుంచి పలుకరించేలాగ స్టేజీకి ఎదురుగా, సభా ప్రాంగణం మధ్యలోంచి ఒక ర్యాంప్‌ను ఏర్పాటు మిగతా 2లో


పీలేరు సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

మా స్టార్ క్యాంపెయినర్లు
ప్రభుత్వ బాధితులే
- 'రా... కదలిరా' సభల్లో టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి- కడప, అనంతపురం ప్రతినిధులు

'వైసిపి తరుపున పోటీ చేయడానికి అభ్యర్థులు దొరకడం లేదు. దొరికిన అభ్యర్థులూ పారిపోతున్నారు. అవును... నాకు స్టార్ క్యాంపెయినర్లు ఉన్నారు. ప్రభుత్వ బాధితులందరూ నా స్టార్ క్యాంపెయినర్లే' అని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రా... కదలిరా కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన అన్నమయ్య జిల్లా పీలేరులోనూ, అనంతపురం జిల్లా ఉరవకొండలోనూ జరిగిన బహిరంగ సభల్లో మాట్లాడారు. ఇతర పార్టీల్లోనూ చంద్రబాబుకు స్టార్ క్యాంపెయినర్లు ఉన్నారని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇదే ఉరవకొండలో జరిగిన బహిరంగ సభలో ఈ నెల 24న వ్యాఖ్యానించారు. దీనిపై చంద్రబాబు... ఉరవకొండలో జరిగిన బహిరంగ సభలో స్పందించారు. ప్రభుత్వ చర్యలను ఎవరు వ్యతిరేకించినా వారందరికీ టిడిపి స్టార్ క్యాంపెయినర్లు అంటూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముద్ర వేస్తున్నారని ఎద్దేవా చేశారు. సంతోషంగా పదవి నుంచి దిగిపోతానని జగన్ ఇటీవల చెబుతున్నాడని గుర్తు చేశారు. ఆయన దిగిపోవడం కాదు... ప్రజలే దించేయనున్నారని తెలిపారు. రాష్ట్రంలో 69 అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులు గెలవలేరనే ఉద్దేశంతో అభ్యర్థులను వైసిపి మార్చిందని, 29 మందికి టికెట్లు ఎగ్గొట్టిందని అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలూ విధ్వంసమయ్యాయని విమర్శించారు. పాలన మొత్తం అస్తవ్యస్తంగా మారిందన్నారు. యువతకు ఉపాధి అవకాశాల్లేకుండా పోయాయని తెలిపారు. ఏటా జాబ్ కేలండర్ అని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. తాము అధికారంలోకి వస్తే ఏటా నాలుగు లక్షల ఉద్యోగాల చొప్పున ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగమొచ్చే వరకు నెలకు మూడు వేల రూపాయల చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. భూ హక్కు చట్టం పేరుతో తీసుకొచ్చిన నల్లచట్టం ఆచరణలో భూభక్షణ చట్టంగా మారిందని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే ఈ చట్టాన్ని రద్దు మిగతా 2లో

యుపిలో కాంగ్రెస్, ఎస్‌పి జట్టు
- కాంగ్రెస్‌కు 11 ఎంపీ సీట్లు : అఖిలేష్ వెల్లడి

లక్నో : ప్రతిపక్షాల ఐక్య వేదిక 'ఇండియా'లోని రెండు ప్రధాన భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ మధ్య ఉత్తరప్రదేశ్‌లో పొత్తు ఉదయించింది. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఇరుపార్టీలు కలిసికట్టుగా పోటీ చేసి బిజెపిని ఓడించాలని నిర్ణయించాయి. ఈ మేరకు ఎస్‌పి అధినేత అఖిలేష్ యాదవ్ శనివారం ప్రకటించారు. కాంగ్రెస్‌కు 11 ఎంపీ స్థానాలు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సీట్ల సర్దుబాటు ప్రయత్నాల్లో ఇది తొలి అడుగు అని ఆయన తెలిపారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలోని 11 కీలకమైన లోక్‌సభ స్థానాలకు సంబంధించి చర్చల్లో పురోగతి సాధించామని ఆయన చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లో మొత్తం 80 లోక్‌సభ స్థానాలు ఉన్న విషయం తెలిసిందే. దేశంలో అత్యధికంగా లోక్‌సభ స్థానాలు ఉన్న రాష్ట్రం ఇదే. 'కాంగ్రెస్‌తో మా సహృద్భావ పొత్తులో తొలి అడుగు పడింది. 11 కీలకమైన స్థానాల విషయంలో పురోగతి ఉంది. ఇది కొనసాగుతుంది. ఇండియా జట్టుతో చరిత్రను మార్చేయాలన్నదే మా లక్ష్యం' అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో అఖిలేష్ తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ మీడియా విభాగం అధిపతి జైరాం రమేష్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. అశోక్ గెహ్లాట్, అఖిలేష్ యాదవ్ మధ్య సీట్ల సర్దుబాటుపై నిర్మాణాత్మక చర్చలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు చర్చలు తుది దశకు చేరుకున్నాయని సమాజ్‌వాదీ పార్టీ నేత ఫక్రుల్ హసన్ చాంద్ తెలిపారు. 'ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ పెద్దది. ఢిల్లీ చేరాలంటే యుపి మీదుగానే వెళ్లాలి. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, రాష్ట్రీయ లోక్‌దళ్ ఇస్తున్న సందేశం ఇండియా బ్లాక్‌ని బలోపేతం చేస్తుంది' అని చాంద్ అన్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ యుపిలో రెండు స్థానాలు గెలుచుకుంది. ఆ పార్టీకి 7.53% ఓట్లు వచ్చాయి. 2019 ఎన్నికల నాటికి కాంగ్రెస్ బలం బాగా తగ్గింది. ఆ పార్టీ 6.36% ఓట్లతో కేవలం ఒకే స్థానాన్ని దక్కించుకుంది.

నేడు నితీష్ రాజీనామా!
- ఆ వెంటనే బిజెపి మద్దతుతో మళ్లీ సిఎంగా ప్రమాణం

పాట్నా: బీహార్ సిఎం నితీష్ కుమార్ ఆదివారం ఉదయం తన పదవికి రాజీనామా చేస్తారని, ఆ వెంటనే బిజెపి దన్నుతో తిరిగి తొమ్మిదోసారి సిఎంగా ప్రమాణం చేస్తారని ఆయనకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తి ఒకరు పిటిఐకి తెలిపారు. రాజీనామా లేఖను గవర్నరుకు సమర్పించే ముందు నితీష్ లాంఛనంగా జెడి(యు) లెజిస్లేచర్ పార్టీ సమావేశం నిర్వహిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇందుకోసం సెలవు రోజైనప్పటికీ ఆదివారం రాష్ట్ర సచివాలయం వంటి ప్రభుత్వ కార్యాలయాలు తెరిచి ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. నితీష్ బిజెపితో వెళితే అంతకన్నా రాజకీయ దివాళాకోరుతనం ఇంకొకటి ఉండదని కాంగ్రెస్ నాయకుడు హరీష్ రావత్ హెచ్చరించారు. నితీష్ బిజెపి పంచన చేరేందుకు అంతా సిద్ధం చేసుకోవడంతో ఆర్‌జెడి లెజిస్లేచర్ పార్టీ శనివారం నాడిక్కడ అత్యవసరంగా సమావేశమై రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితిపై చర్చించింది. పరిస్థితిని బట్టి ఎలాంటి నిర్ణయమైనా తీసుకునే అధికారాన్ని ఆ పార్టీ వ్యవస్థాపకుడు లాలూ ప్రసాద్ యాదవ్‌కు అప్పగిస్తూ ఏకగ్రీవంగా ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ప్రస్తుతానికి నితీష్‌కు మద్దతు ఉపసంహరించుకునే ఎలాంటి వైఖరి తీసుకోలేదని ఆర్‌జెడి ప్రతినిధి మనోజ్ ఝా మీడియాకు చెప్పారు. మరో వైపు బిజెపి ఎమ్మెల్యేలు, ఎంపీలు సమావేశమై ప్రస్తుత రాజకీయ డ్రామాకు తెరదించేందుకు కేంద్ర నాయకత్వం ఇచ్చిన ఆదేశాలను తు.చ తప్పక పాటించాలని నిర్ణయించారు. గతసారి బీహార్ నుంచి 17 లోక్‌సభ స్థానాలను బిజెపి గెలుచుకుంది. ఈసారి బిజెపికి సీట్లు బాగా తగ్గనున్నాయని ఇటీవల నిర్వహించిన ఒక సర్వేలో తేలడంతో నితీష్‌ను మళ్లీ తనవైపు తిప్పుకునేందుకు బిజెపి సరికొత్త డ్రామాకు తెరతీసింది. జెడి (యు) క్షీణత ఇప్పటికే మొదలైందని, బిజెపితో జత కలిస్తే ఉన్నది కూడా ఊడిపోతుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. 2015 ఎన్నికల్లో 71 అసెంబ్లీ స్థానాలున్న జెడి (యు) 2020 ఎన్నికల్లో బిజెపితో కలసి పోటీ చేయడం వల్ల 43 స్థానాలకు పడిపోయింది. అదే సమయంలో బిజెపి తన బలాన్ని 53 నుంచి 74 స్థానాలకు పెంచుకుంది. బీహార్‌లో ప్రస్తుతం వివిధ రాజకీయ పార్టీల బలాబలాల పొందికను బట్టి చూస్తే 243 స్థానాలున్న రాష్ట్ర అసెంబ్లీలో నితీష్ నేతృత్వంలోని జెడి(యు)కి 45, బిజెపికి 78, ఆర్‌జెడికి 79, కాంగ్రెస్‌కు 19, సిపిఐ(ఎంఎల్)కు 19, సిపిఎంకు 2, సిపిఐకి 2 సీట్లు ఉన్నాయి. ఇండిపెండెంటు ఒకరు ఉన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్- 122. జెడి(యు), ఎన్డీయే పంచన చేరితే ఆ కూటమి బలం 123కు చేరుతుంది.


వి.వెంకటస్వామి (ఫైల్)

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావుకు పితృ వియోగం
- నేడు స్వగ్రామంలో అంత్యక్రియలు

2

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు.. రూ.లక్ష, తులం బంగారం
- తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి

లోపలి పేజీలో..

డిఎస్‌సి దీక్షాశిబిరంపై పోలీసు దాడి
- నిరుద్యోగులకు బెదిరింపులు
- ఆందోళనకు మద్దతు తెలిపిన పలు సంఘాలు
- తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎంఎల్‌సి వెంకటేశ్వరరావు డిమాండ్

సంఘీభావం తెలుపుతున్న ఎంఎల్‌సి ఐవి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకోసం మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్‌చేస్తూ డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగులు చేపట్టిన 36 గంటల నిరాహార దీక్షా శిబిరంపై పోలీసులు శనివారం విరుచుకుపడ్డారు. విజయవాడ ధర్నా చౌక్‌లో దీక్షలను ప్రారంభించిన కాసేపటికే అక్కడకు వచ్చిన పోలీసులు నిరుద్యోగులపై బెదిరింపులకు దిగారు. దీక్షలకు అనుమతి లేదని, తక్షణమే శిబిరాన్ని తీసివేయాలని ఒత్తిడి చేశారు. నిరుద్యోగులు వాదనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అనుమతి లేకుండా దీక్షల్లో కూర్చున్న నిరుద్యోగులపై కేసులు పెడతామని పోలీసులు హెచ్చరించారు. ఒకవైపు నిరుద్యోగులతో మాట్లాడుతూనే మరోవైపు టెంట్‌ను పోలీసులే తొలగించారు. దీనిని అడ్డుకోవడానికి నిరుద్యోగులు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఆ తరువాత దీక్షలలో కూర్చున్న వారిని కూడా బలవంతంగా అక్కడ నుండి పంపించివేశారు. అంతకుముందు దీక్షా శిబిరాన్ని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. దీక్షకు దిగిన వారికి పూలమాలలు వేసి ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయ ఖాళీ పోస్టులపై రాష్ట్రప్రభుత్వం నాటకం ఆడుతోందని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడిగా పాదయాత్రలో రాష్ట్రంలో 23వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో 50,577 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో గతేడాది ప్రకటించిందని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఆరు వేల పోస్టులు మాత్రమే ఖాళీలు ఉన్నాయని శాసనమండలిలో కూడా అసత్య సమాధానాలు చెబుతోందని తెలిపారు. ఆర్థిక, రాజకీయ అవసరాల కోసం పదవీ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచి నిరుద్యోగులకు అన్యాయం చేశారని విమర్శించారు. రాబోయే జూన్ నాటికి ఖాళీ కానున్న పోస్టులతో కలిపి 50 వేల పోస్టులతో మెగా డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వం కూడా డిఎస్సి మిగతా 2లో

ధరల మంట నిజమే!
- సర్కారు ఒప్పుకోలు
- ప్రణాళికా శాఖ నివేదికలో వెల్లడి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కొంతకాలంగా నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక శాఖ ఒక నివేదికను రూపొందించింది. ప్రజానీకానికి అత్యవసరమైన 23 రకాల వస్తువుల ధరలు గత ఏడాది కాలంలో పెరుగుతూనే ఉన్నాయని నివేదికలో పేర్కొన్నారు. 2022 డిసెంబర్‌లో ఉన్న సరుకుల ధరలకీ, 2023 సంవత్సరంలో డిసెంబర్ నాటి ధరలకీ మధ్య అంతరాన్ని ఈ నివేదికలో ప్రణాళికా శాఖ ప్రధానంగా వివరించింది. ఈ నివేదిక ప్రకారం అత్యవసరమైన బియ్యం, పప్పు దినుసులు, ఉప్పు, ఉల్లిపాయలు, పసుపుతోపాటు టమాటా ధరలు కూడా ఏడాది కాలంలో గణనీయంగా పెరిగాయి. ఉల్లిపాయ ధరలు ఏకంగా 63.59 శాతం పెరిగినట్లు నివేదికలో తెలిపారు. 'ఇంత భారీ స్థాయిలో పెరడగం ఆందోళనకరం. ఇప్పటికీ కిలో ఉల్లి 30 రూపాయల దాకా విక్రయిస్తున్నారు.' అని నివేదికలో పేర్కొన్నారు. టమాటా ధర గత ఏడాదితో పోలిస్తే 56.68 శాతం పెరిగిందని, కందిపప్పు 2022 డిసెంబర్ కన్నా 2023 డిసెంబర్ నాటికి 46.45 శాతం ధర పెరిగిందని పేర్కొన్నారు.

బియ్యం పైపైకి

ప్రతి రోజూ వినియోగించే బియ్యం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. నంబర్-1 బియ్యం ఏకంగా 13.72 శాతం పెరగ్గా, రెండో రకం బియ్యం 12.34 శాతం పెరిగాయి. గోధుమలు కూడా ఎనిమిది శాతం, జొన్న 21 శాతం, రాగులు 18 శాతానికన్నా ఎక్కువగా పెరిగినట్లు తేలింది. ఈ నివేదిక ప్రకారం నూనెల ధరల్లో స్వల్పంగా తగ్గుదల నమోదైంది. భారీ స్థాయిలో ధరలు పెరుగుతున్నట్లు నివేదికలో పేర్కొన్న ప్రభుత్వం అదే సమయంలో వాటి అదుపునకు తీసుకునే చర్యల గురించి మాత్రం నామమాత్రంగా కూడా ప్రస్తావించలేదు.

పెరిగిన నిత్యావసరాల ధరలు (శాతంలో)

సరుకు	శాతం	సరుకు	శాతం
గ్రేడ్-1 బియ్యం	13.72	గ్రేడ్-2 బియ్యం	12.34
గోధుమ	8.06	జొన్నలు	21.27
రాగులు	18.69	సజ్జలు	9.74
కందిపప్పు	46.45	శనగపప్పు	18.67
పెసలు	14.61	మిర్చి పొడి	10.28
ఉల్లిపాయ	63.59	ఉప్పు	6.00
టమోటా	56.68	వంకాయ	48.55

ఫ్లిప్‌కార్ట్ నుంచి బిన్నీ బన్సల్ అవుట్
- వాల్‌మార్ట్ చేతికి వాటాలు

న్యూఢిల్లీ : ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ సహ వ్యవస్థాపకుడు బిన్నీ బన్సల్ ఆ సంస్థ నుంచి పూర్తిగా వైదొలిగారు. 2007లో బిన్నీ బన్సల్, సచిన్ బన్సల్ కలిసి బెంగళూరులో ఫ్లిప్‌కార్ట్‌ను స్థాపించారు. 2018లో ఫ్లిప్‌కార్ట్‌లోని 77 శాతం వాటాలను 16 బిలియన్ డాలర్ల (రూ.1.30 లక్షల కోట్లు)కు అమెరికన్ సంస్థ వాల్‌మార్ట్ కొనుగోలు చేసింది. ఆ తర్వాత బన్సల్‌కు ఇందులో 1-1.8 శాతం మాత్రమే వాటాలు మిగిలాయి. ఆ వాటాలను 1-1.5 బిలియన్ డాలర్లు (రూ.8 వేల - 12 వేల కోట్లు)తో వాల్‌మార్ట్ తాజాగా కొనుగోలు చేసిందని సమాచారం. బిన్నీ బన్సల్ అక్కో, అన్ అకాడమీ, యు సహా దాదాపు 92 సంస్థల్లో పెట్టుబడులు పెట్టారు. బన్సల్ జనవరి 2న ఓప్‌డోర్ పేరుతో కొత్త ఇ-కామర్స్ స్టార్టప్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నెలకొన్న విభేదాల వల్ల ఫ్లిప్‌కార్ట్ బోర్డుకు బన్సల్ రాజీనామా చేశారని సమాచారం. ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన ఫోన్‌పేలోనూ బన్సల్ పెట్టుబడులు ఉన్నాయి.

మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు

టిటిడి అటవీ కార్మికుల నిరవధిక దీక్ష
- ధార్మిక సంస్థలో అధర్మ పాలన : పి మధు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తమను పర్మినెంట్ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) అటవీ కార్మికులు 38 నెలలుగా రిలే దీక్షలు చేస్తున్నా న్యాయం చేయకపోవడంతో శనివారం నుంచి నిరవధిక దీక్షకు దిగారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఆధ్వర్యంలో తొమ్మిది మంది అటవీ కార్మికులు తిరుపతి టిటిడి ఫారెస్టు కార్యాలయం వద్ద దీక్ష చేపట్టారు. రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు, శాసనమండలి మాజీ చైర్మన్ విఠపు బాలసుబ్రమణ్యం, విశ్రాంత న్యాయమూర్తి పి.గుర్రప్ప, రాయలసీమ అధ్యయనాల సంస్థ అధ్యక్షులు భూమన్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి, రిపబ్లికన్ పార్టీ నేత పి.అంజయ్య, సిపిఐ (ఎంఎల్) నేత ఆర్.హరికృష్ణ, ఆప్ పార్టీ నేత నాగేష్, బిఎస్‌పి నేత విజయ్‌కుమార్, జనసేన పార్టీ నేత కిరణ్ రాయల్ తదితరులు దీక్షలో కూర్చున్నవారి మెడలో పూలమాలలు వేసి దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పి.మధు మాట్లాడుతూ ధార్మిక సంస్థ అయిన టిటిడిలో అధర్మం రాజ్యమేలుతోందని, మిగతా 2లో

విఆర్ఓకు కార్యనిర్వాహక అధికారాలు

- జీఓఎంఎస్ 36 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

"నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు" కార్యక్రమంలో పేదలకిచ్చిన ఇంటి స్థలాలకు కన్వేయన్స్ డీడ్ నమోదు చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబందించి డీడ్‌ను అమలు చేసేందుకు ప్రభుత్వం గ్రామ రెవెన్యూ అధికారి (విఆర్ఓ)లకు కార్యనిర్వాహక అధికారాలిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శనివారం జీఓ ఎంఎస్ నెంబరు 36ని విడుదల చేసింది.

ఇందుకు అవసరమైన చర్యలను అన్ని జిల్లాల కలెక్టర్లు తీసుకుంటారని ప్రభుత్వం పేర్కొంది. కన్వేయన్స్ డీడ్ ఇచ్చిన పట్టాలపై పదేళ్ల తర్వాత పూర్తిస్థాయి హక్కులు లబ్ధిదారులకు కలుగుతాయని ప్రభుత్వం తెలిపింది.

పదేళ్లు పూర్తయిన అసైనీలకు ఫ్రీ హోల్డ్ హక్కులు కల్పిస్తూ గెజిట్ విడుదల

పదేళ్ల కాల వ్యవధి పూర్తిచేసుకున్న అసలైన అసైనీలు, చట్టపరమైన వారసులకు ఆయా పట్టాలపై ఫ్రీహోల్డ్ హక్కులు, యాజమాన్య హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం ఇటీవల జీఓ ఎంఎస్ నెంబరు 314ని విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి ప్రభుత్వం శనివారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఇప్పటివరకు ఉన్న అడ్డంకులను అధిగమించేందుకు ప్రిన్సిపల్ యాక్ట్ 1977 (చట్టం-9) ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ ల్యాండ్స్ (బదిలీల నిషేధం) (సవరణ) చట్టం-2021 (2021 చట్టం నెంబరు 35) ద్వారా అన్యాక్రాంతమైన ఫ్రీ హోల్డ్ హక్కులను కల్పించింది. గతంలో యాజమాన్యపు హక్కు 20 సంవత్సరాల గడువును పదేళ్ల కాలానికి పరిమితం చేసింది. .

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

అంతర్జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు కృష్ణా వాసి ఎంపిక

ప్రజాశక్తి-గన్నవరం

పోటీలకు ఎంపికైన ఖమర్ బాషా

అంతర్జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు కృష్ణా జిల్లా వాసి ఎంపికయ్యారు. మార్చి ఒకటి నుంచి మూడు వరకు న్యూఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరగబోయే అంతర్జాతీయ షూటింగ్ బాల్ పోటీలు జరగనున్నాయి. వీటికి కృష్ణా జిల్లా గన్నవరం మండలం ముస్తాబాద గ్రామానికి చెందిన షేక్ ఖమర్ బాషా ఎంపికయ్యారు.

ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశ రాముడు నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. 2022 డిసెంబర్‌లో వారణాసిలో జరిగిన జాతీయ షూటింగ్ బాల్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరుపున ఖమర్ బాషా పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ క్రమంలో అంతర్జాతీయ పోటీలకు ఆయనను ఎంపిక చేశారు. బాషా తల్లిదండ్రులు మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే భారత జట్టుకు మా అబ్బాయి ఎంపికవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆర్థికంగా సహకరించి ప్రోత్సహించాలని కోరారు.

డిఎస్‌సి దీక్షాశిబిరంపై పోలీసు దాడి

(మొదటిపేజీ తరువాయి)

నోటిఫికేషన్ విడుదల చేసి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తుందని, కానీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఒక్క డిఎస్సి కూడా విడుదల చేయలేదని అన్నారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వై రాము, జి రామన్న మాట్లాడుతూ 10లక్షల మందికి పైగా టెట్ రాసి నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ మాట్లాడుతూ ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చిన జగన్ మాట తప్పారని విమర్శించారు. ఎఐవైఎఫ్, పిడిఎస్‌యు ప్రధాన కార్యదర్శులు లెనిన్ బాబు, రాజేష్ మద్దతు తెలిపి ప్రసంగించారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెలర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి, కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వై రాము జి రామన్నతో పాటు ఉపాధ్యక్షులు ఎస్ జయచంద్ర, ఎన్ నాగేశ్వరరావు, కె బాబు, యు రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్ హరీష్, వై కృష్ణకాంత్, పి కృష్ణ, కె సంతోష్, జె రాజకుమార్, శివ తదితరులు దీక్ష చేశారు.

శ్రమ కేంద్రంగానే సమాజ నిర్మాణం

- ప్రొఫెసర్ హరగోపాల్
- ముగిసిన లెనిన్ శత వర్ధంతి 'ఆట పాట మాట'

లెనిన్ శత వర్ధంతి ముగింపు సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

ప్రజాశక్తి - విజయవాడ

శ్రమ కేంద్రంగానే సమాజ నిర్మాణం జరుగుతుందని లెనిన్ నిరూపించారని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. సమాజ మార్పు విప్లవం ద్వారా తీసుకురావడం సాధ్యమని చేసి చూపిన మహనీయుడని కొనియాడారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా ప్రజానాట్య మండలి, ఎపి ప్రజానాట్య మండలి ఆధ్వర్యాన విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో వారం రోజులపాటు 'ఆట-పాట-మాట' పేరుతో నిర్వహించిన సాంస్కృతికోత్సవాలు శనివారంతో ముగిశాయి. ముగింపు సభలో హరగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుతం మన దేశంలో సామ్రాజ్యవాద విషవాయువులు వీస్తున్న తరుణంలో వాటిని ఎలా ఎదుర్కొని నిలబడాలో ఆలోచన చేయాలన్నారు. చైతన్యవంతమైన సమాజం కోసం, సమాజ మార్పు కోసం లెనిన్ స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ.. దేశంలో మతోన్మాద శక్తుల బలం పెరగడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు.

ఈ నేపథ్యంలో కమ్యూనిస్టుల ఐక్యత ఎంతో అవసరమన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి హెచ్.బాబూరావు మాట్లాడుతూ.. కార్పొరేట్ హిందుత్వాన్ని ఎదుర్కోవటానికి వర్గపోరాటం అవసరమన్నారు. వీక్షణం పత్రిక సంపాదకులు ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ లెనిన్ రచనలను నేటి తరం వారు చదివి అర్థం చేసుకోవాలని సూచించారు. రచయిత్రి కాత్యాయనివిద్మహే మాట్లాడుతూ వామపక్షాలు కలిసి పని చేయటానికి లెనిన్ ప్రేరణగా ఉన్నారని స్పష్టం చేశారు. సాహితీవేత్త అల్లం రాజయ్య మాట్లాడుతూ మానవ సంబంధాలను కాపాడడంతో లెనిన్ కృషిని వివరించారు. సిపిఐ సీనియర్ నాయకులు అక్కినేని చంద్రరావు అధ్యక్షతన జరిగిన సభలో అభ్యుదయవాది చిరుగుపాటి భాస్కరరావు, ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ కె.లక్ష్మయ్య, విశాలాంధ్ర విజ్ఞాన సమితి డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు, మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ విగ్రహ కమిటీ సభ్యులు బి.జమిందార్, గోళ్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ ప్రింటర్స్ ప్రచురించిన పుస్తకాలను అతిథులకు కె.రామకృష్ణ అందించారు.

ఆలోచనాత్మకంగా సాగిన కళా ప్రదర్శనలు

లెనిన్ శత వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఆలోచనాత్మకంగా సాగాయి. కళాకారులు ఆలపించిన విప్లవ గీతాలు ఉర్రూతలూగించాయి. ఒడిశా సిలింగేర్‌కు చెందిన ప్రజాకళా మండలి కళాకారు టీమ్ లీడర్ రాంబాబు దర్శకత్వంలో రైతుల కష్టాలను వివరిస్తూ చేసిన గిరిజన నత్యం ఆకట్టుకుంది. కళాకారులకు జ్ఞాపికలను, లెనిన్ చిత్రపటంతో కూడిన క్యాలెండర్‌లను అందజేశారు. వారంరోజుల పాటు సాగిన సాంస్కృతిక సంబరాలు లెనిన్ సెంటర్‌కు కొత్త సందడిని తీసుకురావటంతోపాటు ప్రేరణ కలిగించాయి.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావుకు పితృ వియోగం

- నేడు కెల్లంపల్లిలో అంత్యక్రియలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో, పొదిలి (ప్రకాశం)

తన తండ్రి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న వి.శ్రీనివాసరావు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి వంకాయలపాటి వెంకటస్వామి (94) శనివారం సాయంత్రం హైదరాబాద్ బర్కత్‌పురాలోని సిసి షరాఫ్ ఆస్పత్రిలో కన్నుమూశారు. ఆయన స్వగ్రామం ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం కెల్లంపల్లి. గత కొద్ది సంవత్సరాలుగా అనారోగ్యం, వయోభారంతో బాధపడుతున్న వెంకటస్వామి హైదరాబాద్‌లోని తన మనుమరాలి వద్ద ఉంటున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కన్నుమూశారు. ఆయనకు ఒక కుమారుడు, అయిదుగురు కుమార్తెలు ఉన్నారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ పిలుపులో భాగంగా హెల్త్ వలంటీరుగా నెల్లూరులో పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలోని ప్రజావైద్యశాలలో వెంకటస్వామి తర్ఫీదు పొందారు. తదుపరి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలో ఆర్ఎంపిగా పాసయ్యారు. వ్యవసాయం చేస్తూనే, కెల్లంపల్లి గ్రామంలో ఏడు దశాబ్దాల పాటు ప్రజలకు వైద్య సేవలందించారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ సభ్యునిగా పని చేశారు. కెల్లంపల్లి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై ప్రజలకు సేవలందించారు. ఆయన అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామంలో నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. వెంకటస్వామి భౌతికకాయాన్ని వి.శ్రీనివాసరావు, సిపిఎం తెలంగాణ నాయకులు ఎస్.వీరయ్య, జ్యోతి, సాగర్, వెంకట్రాములు, పి.ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, స్వేచ్ఛ వ్యవస్థాపక నేత వై. కిరణ్ చంద్ర తదితరులు సందర్శించి నివాళు లర్పించారు. వెంకటస్వామి మరణవార్త తెలియగానే వి.శ్రీనివాసరావుకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, మాజీ ఎంపి పి.మధు, సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తదితరులు ఫోన్ చేసి పరామర్శించారు. సిపిఎం తెలంగాణ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సంతాపం తెలిపారు.

కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు లక్ష, తులం బంగారం

తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఇచ్చే నగదు రూ.1,00,116తో పాటు తులం బంగారం ఇచ్చేందుకు అవసరమైన బడ్జెట్ ప్రణాళికలు తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే దీన్ని అమలు చేస్తామని ఆయన తెలిపారు. బిసి, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై సచివాలయంలో ఆయా శాఖల మంత్రులు, ఉన్నతాధికారులతో సిఎం సమీక్షించారు. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎన్నికల హామీ మేరకు రాష్ట్రంలో త్వరలో కుల గణన చేపట్టనున్నట్టు తెలిపారు.

వీటికి అనుగుణంగా అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, సిఎస్ శాంతికుమారి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఐలు రాష్ట్ర అధ్యక్షులుగా కెంగార కుమార్

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో, విజయవాడ

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర అధ్యక్షులుగా కెంగార కుమార్ ఎన్నికయ్యారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో శనివారం జరిగిన ఐలు రాష్ట్ర కమిటీ సమావేశంలో ప్రస్తుత రాష్ట్ర కోశాధికారిగా ఉన్న కెంగార కుమార్‌ను రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న సుంకర రాజేంద్రప్రసాద్‌ను ఐలు జాతీయ వర్కింగ్ అధ్యక్షులుగా కోల్‌కత్తాలో జరిగిన జాతీయ మహాసభలో ఎన్నుకోవడంతో రాష్ట్ర అధ్యక్షుడి కోసం ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో కర్నూలుకు చెందిన కెంగార కుమార్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా, రాష్ట్ర కోశాధికారిగా విజయవాడకు చెందిన రమేష్ కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఐలు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కు చట్టం రద్దుపై ప్రభుత్వం స్పందించాలి

భూ యాజమాన్య హక్కు చట్టం-2022ను రద్దు చేయాలని న్యాయవాదులు గత నెలన్నర రోజులుగా చేస్తున్న ఉద్యమంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలు) డిమాండ్ చేసింది. న్యాయవాదుల ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ చట్టానికి వ్యతిరేకంగా న్యాయవాదులు చేస్తున్న ఉద్యమం, ఆ చట్టం దుష్పరిణామాలను ప్రజలకు వివరించేందుకు విజయవాడలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించాలని, ఇందుకు పలు న్యాయవాద, ప్రజా సంఘాలను కలుపుకోవాలని నిర్ణయించింది. అపరిష్కృతంగా ఉన్న న్యాయవాదుల సమస్యలపైన, న్యాయస్థానాల్లో న్యాయవాదులు, కక్షిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది.

ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య

- కుటుంబ కలహాలతో ఒకరు..
- ట్రేడింగ్‌లో మోసపోయి మరొకరు..

ప్రజాశక్తి - తిరుపతి సిటీ, మైలవరం

అనారోగ్యం, కుటుంబ కలహాలతో ఓ విద్యార్థి... ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో మోసపోయానని మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, మృతుల కుటుంబ సభ్యుల వివరాల మేరకు...తిరుపతి జిల్లా పనపాకంకు చెందిన జయంతి కుమార్తె ప్రశాంతి (17) తిరుపతిలోని ఓ ప్రయివేట్ విద్యాసంస్థలో ఇంటర్ ఎంపిసి ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఇటీవల ఆమె అనారోగ్యం బారినపడ్డారు. ఈ క్రమంలో ఈ నెల 22న ఇంటికి వెళ్లి తిరిగి 25న హాస్టల్‌కు వచ్చారు. 26న ఇంటి వద్ద జరిగిన గొడవ, అనారోగ్యంతో తీవ్ర మనస్తాపానికి గురై హాస్టల్ గదిలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతురాలు రాసిన సూసైడ్ లేఖను పోలీసులు స్వాధీనం చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు.

రోషిణి (ఫైల్)

ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం చందర్లపాడు మండలం ముప్పాళ్ళ గ్రామానికి చెందిన బొర్రా నరసింహారావు కుమార్తె రోషిణి మైలవరంలోని ఓ ప్రయివేట్ కళాశాలలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఇన్‌స్టాగ్రామ్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెట్టి మోసపోవడంతో తల్లిదండ్రులకు విషయం చెప్పారు. తల్లిదండ్రులు మందలించారని, తనను కళాశాల మాన్పిస్తారని తోటి విద్యార్థులతో చెప్పి మదనపడేవారు. ఈ క్రమంలో హాస్టల్ గదిలో శుక్రవారం అర్ధరాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీలేరు సభలో జనం

ప్రభుత్వ బాధితులే

(మొదటిపేజీ తరువాయి)

చేస్తామన్నారు. సాగునీటికి ప్రాధాన్యత కల్పించి ప్రతి ఎకరానికీ నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రద్దు చేసిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సబ్‌ప్లాన్‌ను అమల్లోకి తీసుకొస్తామన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఐదేళ్లలో తొమ్మిదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెరిగాయని, రూ.56 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేసిందని వివరించారు. ఈ భారాల్లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. 2019లో రాయలసీమ ప్రాజెక్టుల అభివృద్ధికి తమ ప్రభుత్వం రూ.12,500 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. ఈ ఐదేళ్ల వైసిపి పాలనలో రూ.200 కోట్లు కూడా ఖర్చు చేయకుండా సీమ ద్రోహిగా జగన్ మిగిలిపోయారని విమర్శించారు. రాయలసీమ అభివృద్ధికి ఎన్‌టిఆర్ హయాం నుంచీ పాటు పడుతున్నామని తెలిపారు. గోదావరి నుంచి వృథాగా సముద్రం పాలవుతున్న రెండు వేల టిఎంసిల్లో 120 టిఎంసిలను శ్రీశైలానికి తీసుకొస్తే రాయలసీమను రతనాల సీమగా మార్చొచ్చన్నారు. సోలార్ విద్యుత్ ద్వారా రైతులకు వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందిస్తామన్నారు. అన్నమయ్య డ్యామ్ కొట్టుకునిపోయిన ఘటనలో 40 మంది చనిపోయారని, మూడేళ్లవుతున్నప్పటికీ ఈ డ్యామ్‌ను పునరుద్ధరణ ఏదని ప్రశ్నించారు. ఆవులపల్లి రిజర్వాయర్ పనుల పేరుతో రూ.600 కోట్లను మంత్రి పెద్దిరెడ్డి దోచేశాడని ఆరోపించారు. వైసిపి అసమర్థ, ఆరాచక, విధ్వంసక పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం వచ్చిందన్నారు. టిడిపి, జనసేన పార్టీ కార్యకర్తలు ఈ సంకల్పబలంతో మరో 74 రోజులపాటు ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. వైసిపిని ఇంటికి పంపించడానికి ప్రభుత్వోద్యోగులు, యువత సిద్ధంగా ఉన్నారన్నారు.

'అసైన్డ్' సవరణలతో దళితుల హక్కులకు భంగం

- ఎఐఎడబ్ల్యుయు విమర్శ
- రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు మద్దతు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో అసైన్డ్ చట్టానికి ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన సవరణలతో దళితుల హక్కులకు భంగం వాటిల్లుతోందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) తీవ్రంగా విమర్శించింది. ఈ చట్ట సవరణలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలకు మద్దతు ప్రకటించింది. ఈ మేరకు శనివారం నాడిక్కడ ఏపి, తెలంగాణ భవన్‌లో ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్ మీడియాతో మాట్లాడారు. అసైన్డ్ భూములను ఇతరులకు కట్టబెట్టేందుకే జగన్ ప్రభుత్వం భూ బకాసురునిలాగా మారి దుర్మార్గమైన సవరణలు తీసుకొచ్చిందని ఆయన అన్నారు.

సామాజిక న్యాయం పేరిట దళితులకు, గిరిజనులకున్న భూములను లాగేసుకుంటున్నారని విమర్శించారు. అసైన్డ్ భూముల చట్టాన్ని కాలరాయడమంటే దళితుల హక్కుల తొక్కేయడమేనన్నారు. అసైన్డ్ భూముల లబ్ధిదారులు కోర్టుకు వెళ్లకుండా ఉండేలా నూతన చట్టాలు సవరించారని, ఈ సవరణలను ఎఐఎడబ్ల్యుయు తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అసైన్డ్ భూములు పట్టా భూములతో సమానంగా చూడాలని సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తు చేశారు. అసైన్డ్ భూముల చట్టాన్ని సవరించడమంటే సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకించడమేనన్నారు. అసైన్డ్ భూమిపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న జీవోను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

8న కేరళ సంఘీభావ దినం

దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 8న కేరళ సంఘీభావ దినం నిర్వహించాలని ఎఐఎడబ్ల్యుయు కేంద్ర వర్కింగ్ కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఎఐఎడబ్ల్యుయు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ విజయరాఘవ్, బి వెంకట్ ప్రకటన విడుదల చేశారు. కేంద్రప్రభుత్వ వివక్ష పూరిత చర్యలకు వ్యతిరేకంగా కేరళ ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజా ప్రతినిధులు ఢిల్లీలో ఆందోళన చేయనున్న సంగతి తెలిసిందే. ప్రతిపక్ష పార్టీల పాలిత రాష్ట్రాలపై వివక్ష పూరిత చర్యల అమలుతో బిజెపి ప్రభుత్వం సమాఖ్య వాదంపై దాడికి పాల్పడిందని వారు విమర్శించారు. ఏడేళ్లలో కేరళలో వామపక్ష ప్రభుత్వం 2,34,567 భూ పట్టాలను పంపిణీ చేసిందన్నారు. ఆరేళ్లలో ఇళ్లులేని పేదలకు మూడు లక్షలకు పైగా ఇళ్లు పంపిణీ చేసిందన్నారు. అందులో ఎక్కువ మంది వ్యవసాయ కార్మికులేనని అన్నారు. ఈ పరిస్థితుల్లో కేరళ ప్రభుత్వంపైనే కాకుండా, కేరళలోని కార్మిక, పేద ప్రజలపైన బిజెపి ప్రభుత్వం దాడి చేస్తుందని పేర్కొన్నారు. ఈ దాడులను వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శనలు చేపట్టడం ద్వారా కేరళకు దేశ ప్రజానీకమంతా సంఘీభావం తెలియజేయాలని కోరారు.

ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కరించాలి

- సిఎంకు వి.శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అత్యవసర సేవలకు సాయమందిస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉన్న ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి శనివారం ఆయన లేఖ రాశారు. ఆరోగ్య మిత్రలు 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారని, పథకం గుర్తింపు పొందేలా కృషిచేయడంలో వీరిది ప్రధాన భూమికని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీతో పాటు ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఇహెచ్ఎస్), వర్కింగ్ జర్నలిస్టు ఆరోగ్య పథకం (డబ్ల్యుజెహెచ్ఎస్), ఆరోగ్య రక్ష వంటి పథకాల్లో విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇంతలా కష్టపడుతున్నా ఇప్పటికీ సరైన జీతంలేక, ఉద్యోగ భద్రత లేక, క్యాడర్ లేక సతమతమవుతున్నారని వివరించారు. ప్రభుత్వం తాజాగా బదిలీలు చేపట్టిందని, నామమాత్రపు జీతాలతో సతమతమవుతున్న ఉద్యోగులు బదిలీలతో రవాణా ఖర్చులు పెరిగి వచ్చే ఆదాయంలో కోత పడి కుటుంబ జీవనం కష్టంగా మారిందని తెలిపారు. వీరి సమస్యలను సంబంధిత యూనియన్ ఎప్పటికప్పుడు పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఎలాంటి ప్రయోజనమూ లేదని వివరించారు. వెంటనే వారి సమస్యలపై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వారికి కేటగిరీ 1 క్యాడర్ ఇవ్వాలని, కోవిడ్ కాలంలో ప్రాణాలు కోల్పోయిన ఆరోగ్యమిత్ర కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు పరిహారంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఇవ్వాలని సిఎంకు విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యమిత్రల కుటుంబాలకు ఇహెచ్ఎస్ కార్డులు మంజూరు చేయాలని, అన్ని డిపార్టమెంట్లు మాదిరి ఆరోగ్య మిత్రలకూ ప్రమోషన్లు అప్పగించాలని, ఉద్యోగ భద్రత ఇవ్వడంతోపాటు హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని కోరారు. సీనియర్ అసిస్టెంట్ క్యాడర్ కల్పించి మెడికల్ డిపార్టుమెంట్‌లో ఉన్నట్లు 30 రోజులు మెడికల్ లీవులు ఇవ్వాలని కోరారు. వారి సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిర్ణయాన్ని విరమించుకోవాలి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను నూరు శాతం అమ్మాలన్న నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశాఖలోని జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామిలతో కలిసి ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. కేంద్రం స్టీల్‌ప్లాంట్‌ను నూరు శాతం అమ్మాలని నిర్ణయించి నేటితో మూడేళ్లు అయ్యిందన్నారు. నాటి నుంచి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో పోరాటాలు సాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలూ ఉక్కు ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకించాయని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసిందన్నారు. జాతీయ కార్మిక సంఘాలన్నీ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకించాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాన్ని గౌరవించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోకుండా మూడేళ్లుగా నాటకమాడిందని, గనుల లీజులు పునరుద్ధరించకుండా ద్రోహం చేసిందని విమర్శించారు. 2020-21లో ప్లాంట్‌కు రూ.915 కోట్లు లాభాలు వచ్చినా కావాలనే ముడిసరుకు కొనడానికి నిధులు కేటాయించలేదని తెలిపారు. 2022-23లో రూ.3900 కోట్లు భారీ నష్టం రావడానికి కారణం కేంద్రమేనని చెప్పారు. సొంత గనుల సమస్యను నేటికీ పరిష్కరించలేదన్నారు. స్టీల్‌ను ఉత్పత్తి చేస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు ఇవ్వకుండా దక్షిణకొరియాకు చెందిన పోస్కో కంపెనీకి ఒడిశాలో ఉన్న ఉక్కు గనులు కేటాయించడం ఏ విధమైన దేశభక్తి ? అని ప్రశ్నించారు. ప్రయివేట్‌వారిని విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోకి దూర్చాలన్న దుర్బుద్ధితోనే బ్లాస్ట్ ఫర్నేస్ - 3కు ముడిసరుకును సరఫరా చేసే నెపంతో ఉత్పత్తి చేసిన విశాఖ స్టీల్‌ను జిందాల్‌కు అప్పగించేలా ఒప్పందం చేసుకున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో కలపడం ద్వారా గనుల సమస్యను పరిష్కరించవచ్చునన్నారు. ప్లాంట్‌లో ఐదేళ్లలో 5800 మంది అధికారుల, పర్మినెంట్ ఉద్యోగుల ఖాళీలను కావాలనే నింపకుండా స్థానికులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి రాష్ట్ర ప్రజలు ముందుకు రావాలని కోరారు.

మాదిగలకు ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నాం

- పురంధేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : మాదిగలకు ఇచ్చిన హామీకి బిజెపి కట్టుబడి ఉందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి పేర్కొన్నారు. విజయవాడ బిజెపి కార్యాలయంలో ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు నేతృత్వంలోని ప్రతినిధుల బృందం ఆమెను శనివారం కలిసి, మాదిగల సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పురంధేశ్వరి మాట్లాడుతూ మాదిగల సమస్యలను పార్టీ జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా దృష్టికి తీసుకెళ్తామన్నారు.

భీమునిపట్నం సభకు హాజరైన జనం

సంక్షేమ పథకాలే

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. జగన్ సభా వేదిక వద్దకు మధ్యాహ్నం 3.45 గంటలకు రాగానే ఒకసారికార్యకర్తల చప్పట్లు, కేరింతలు, నినాదాల మధ్య దీనిపై నడుస్తూ వారందరికీ అభివాదం చేశారు. తన ప్రసంగం ముగిసిన తర్వాత కూడా ఇలాగే సాయంత్రం 5.25 గంటలకు చేశారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు, రాజన్నదొర, సీదిరి అప్పలరాజు, వైసిపి ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, ఎంపి ఎంవివి సత్యనారాయణ, ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

టిటిడి అటవీ కార్మికుల నిరవధిక దీక్ష

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాస్వామ్య విలువలు, సహజ న్యాయసూత్రాలు పాటించడం లేదని విమర్శించారు. టిటిడి చైర్మన్‌గా భూమన కరుణాకర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించి ఐదు నెలలైనా అటవీ కార్మికుల సమస్యలపై చర్చించకపోవడం దారుణమన్నారు. వెంటనే వారిని పర్మినెంట్ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వితపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ టిటిడి ఇటీవల కాలంలో వివాదాలకు కేంద్రంగా మారిందని, జూనియర్లను పర్మినెంట్ చేసి సీనియర్లను పర్మినెంట్ చేయకుండా కార్పొరేషన్‌లో బలవంతంగా కలపడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. పి.గుర్రప్ప మాట్లాడుతూ టిటిడి లాంటి ప్రతిష్టాత్మక సంస్థ ఇలాంటి వివాదాల్లో కూరుకుపోవడం మంచిది కాదన్నారు. ఏ రోజైనా న్యాయస్థానాలలో గెలుపు అటవీ కార్మికులదేనని పేర్కొన్నారు. భూమన్ మాట్లాడుతూ అటవీ కార్మికుల పోరాటం న్యాయబద్ధమైందన్నారు. వారి సమస్యలను పరిష్కరించకపోతే తానూ దీక్షలో పాల్గొనాల్సి వస్తుందని హెచ్చరించారు. పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ టిటిడి ఉన్నతాధికారులు టిటిడి పనుల కంటే అధికార పార్టీకి సేవలు చేయడంలోనే తలమునకలై ఉన్నారని విమర్శించారు. ఆటో కార్మికులు, హమాలీలు, బిల్డింగ్ వర్కర్లు, హాకర్లు, రుయా ఆస్పత్రి కాంట్రాక్ట్ కార్మికులు, శెట్టిపల్లి భూ బాధితులు, స్విమ్స్ ఆస్పత్రి కార్మికులు, ప్రయివేట్ బస్సు కార్మికులు, అంగన్‌వాడీలు, మెడికల్ రిప్రజంటేటివ్‌లు, ఆర్‌టిసి కార్మికులు, అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు, కల్యాణ కట్ట క్షురకులు, టిటిడి కాంట్రాక్ట్ కార్మికులు, విద్యార్థులు దీక్షలకు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు తెలిపారు.

నేడు రాజమహేంద్రవరంలో ఒపిఎస్ సాధన సభ : యుటిఎఫ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పాత పెన్షన్ సాధన కోసం అన్ని రాజకీయ పక్షాలతో ఈ నెల 28న తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో యుటిఎఫ్ ఆధ్వర్యాన 'ఓట్ ఫర్ ఒపిఎస్' సభను నిర్వహిస్తున్నామని, దీన్ని జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎస్ఎస్.ప్రసాద్, ఎన్.వెంకటేశ్వర్లు కోరారు. రాజమహేంద్రవరంలోని ప్రెస్‌క్లబ్‌లో వారు శనివారం మీడియాతో మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పక్షాలను ఈ సభకు ఆహ్వానించామని తెలిపారు. ఎవరైతే పాత పెన్షన్(ఒపిఎస్)ను ఇస్తామని చెప్పి, ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చుతారో? వారికే తమ మద్దతు ఉంటుందని ప్రసాద్ పేర్కొన్నారు. ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి సిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు జిపిఎస్ అంటూ కొత్త పాట పాడుతున్నారని, ఇది ఉద్యోగ ఉపాధ్యాయులకు ఎంత మాత్రమూ శ్రేయస్కరం కాదన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అని సుప్రీం కోర్టు ఎప్పుడో చెప్పిందన్నారు. న్యాయమైన తమ పోరాటాలను ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేయడం సమంజసం కాదన్నారు. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత ఉద్యోగ ఉపాధ్యాయుల జీవనభృతికి, బతుకు భద్రతకు పెన్షన్ ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శులు ఎన్.అరుణకుమారి, లక్ష్మీరాజా, కోశాధికారి బి.గోపిమూర్తి, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పి.జయకర్, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

30న వైసిపిలోకి మాజీ మంత్రి రావెల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు ఈ నెల 30న వైసిపిలో చేరనున్నారు. 2014 నుంచి 2019 వరకు ప్రత్తిపాడు నుంచి టిడిపి ఎమ్మెల్యేగా ఉన్నారు. 2014 నుంచి 2017 వరకు సాంఘిక సంక్షేమశాఖ మంత్రిగా పని చేశారు. 2019లో టిడిపి నుంచి జనసేనలో చేరారు. పత్తిపాడు నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.

2020లో బిజెపిలో చేరారు. 2022లో బిజెపికి గుడ్‌బై చెప్పి బిఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణలో బిఆర్ఎస్ ఓడిపోయిన తరువాత క్రమంగా ఆ పార్టీకి దూరం అయ్యారు. బిఆర్ఎస్ నుంచి తప్పుకున్న రావెల ఇటీవల విజయవాడలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటును అభినందిస్తూ సిఎం జగన్‌ను పొగడ్తలతో ముంచెత్తారు. తాజాగా వైసిపి నాయకులతో జరిపిన చర్చల తరువాత ఆ పార్టీలో చేరేందుకు సిద్ధం అయ్యారు. వైసిపి తరుపున పత్తిపాడు నుంచి ఆయనకు అవకాశం ఇస్తారని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే పత్తిపాడు నుంచి బాలసాని కిరణ్‌ను ఇన్‌ఛార్జిగా ప్రకటించినా సర్వేల్లో అభ్యర్థిని మార్చాలని నివేదికలు రావడంతో రావెల కిషోర్‌ను పోటీ చేయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ధాన్యం రైతుకు పు(పె)ట్టెడు కష్టాలు

- ఆర్‌బికెల్లో నిర్ణయించిన ధరలో మిల్లర్ల కోత
- ఆన్‌లైన్లో దూర ప్రాంత మిల్లులకు కేటాయింపులు
- రవాణాకు కిరాయిల మోత

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

-కృష్ణా జిల్లా ఘంటసాల మండలం చిట్టూర్పుకు చెందిన మల్లుపెద్ది నారాయణ తన ఆరు ఎకరాల్లో పండించిన ధాన్యాన్ని స్థానిక రైతు భరోసా కేంద్రానికి తీసుకెళ్లారు. ఈ ధాన్యంలో నూక శాతం ఎక్కువ వస్తోందనే కారణంతో ఆర్‌బికెలో 75 కిలోల బస్తాకు రూ.1,600 ధర నిర్ణయించారు. ఆన్‌లైన్లో పేర్కొన్న విధంగా ఈ ధాన్యాన్ని మూడు రైస్ మిల్లులకు ఆ రైతు తరలించాల్సి వచ్చింది. స్థానికంగా ఉన్న రైస్ మిల్లు, చల్లపల్లి మండలం మాజేరు రైస్ మిల్లుల వారు ఆర్‌బికెలో నిర్ణయించిన ధరకే ధాన్యం కొనుగోలు చేశారు. పాగోలు పద్మజా మోడరన్ రైస్ మిల్లు వారు మాత్రం బస్తాకు రూ.1,350 మాత్రమే చెల్లిస్తామని రైతుకు చెప్పారు. మిల్లులో ధర తగ్గించిన విషయాన్ని ఆర్‌బికె ట్రక్ షీట్‌లో నమోదు చేయాలని రైతు పట్టుబట్టినా మిల్లరు అంగీకరించలేదు. దీంతో, చివరకు రూ.1400కు మించి ఇచ్చేది లేదని మిల్లరు తేల్చి చెప్పారు. దీంతో, ఆర్‌బికెల్లో నిర్ణయించిన ధర కన్నా బస్తాకు రూ.200 తక్కువకు రైతు అమ్ముకోవాల్సి వచ్చింది. ఈ మిల్లులో అమ్మిన 60 బస్తాలకు సంబంధించి రూ.12 వేలు ఆయన నష్టపోయారు. ఈ ఒక్క రైతుదే కాదు... జిల్లాలోని పలువురి రైతుల పరిస్థితి ఈ విధంగానే ఉంది. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కావడం లేదని, మిల్లర్లు అడిగిన ధరకే అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోయారు.

ధాన్యం అమ్మకాల్లో రైతులకు పు(పె)ట్టెడు కష్టాలు ఎదురవుతున్నాయి. రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బికెల్లో) నిర్ణయించిన ధరల్లోనూ రైస్ మిల్లర్లు భారీగా కోత పెడుతున్నారు. ఆన్‌లైన్‌లో చూపిన విధంగా ధాన్యం దూర ప్రాంత మిల్లులకు తరలించాల్సి రావడంతో అదనపు కిరాయిల భారం రైతులు, కౌలు రైతులపై పడుతోంది. మరోపక్క ధాన్యం నింపడానికి అవసరమైన సంచులు రైతులకు సకాలంలో అందడం లేదు. గత ఖరీఫ్ సీజన్లో రాష్ట్రంలోనే అత్యధికంగా కృష్ణా జిల్లాలో 3.54 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. పంట దిగుబడులు చేతికి వచ్చే సమయంలో వచ్చిన మిచౌంగ్ తుపాను రైతులను నిలువునా ముంచింది. దీని ప్రభావంతో జిల్లాలోని 1,55,766 ఎకరాల్లో వరి పంట తడిసిపోయింది. తడిసి రంగు మారిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం నిబంధనల్లో ఎటువంటి సడలింపూ ఇవ్వలేదు. పైగా, ఆర్‌బికెల్లో నిర్ణయించిన ధరకే మిల్లర్లు కొంటారని ప్రభుత్వ అధికారులు చెబుతున్న మాటలు ఆచరణకు నోచుకోవడం లేదు. 'ఎ' గ్రేడ్ ధాన్యానికి 75 కిలోల బస్తాకు కనీస మద్దతు ధర రూ.1,653 చెల్లించాల్సి ఉంది. ధాన్యం నాణ్యతా ప్రమాణాలు ప్రామాణికంగా ఆర్‌బికెల్లో ధర నిర్ణయిస్తున్నారు. ఆ ధర కూడా కొన్ని మిల్లుల్లో రైతులకు దక్కడం లేదు.

రవాణా కష్టాలు!

గతంలో ఆఫ్‌లైన్‌లో ధాన్యం రవాణాకు అవకాశం ఉంది. తమకు సమీపంలోని మిల్లులకు రైతులు ధాన్యాన్ని రవాణా చేశారు. కిరాయిల భారం తగ్గించుకున్నారు. సంక్రాంతి పండగ తర్వాత ఆన్‌లైన్‌కు మార్చారు. దీంతో, అత్యధికంగా 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న రైస్ మిల్లులకూ రైతులు ధాన్యం తరలించాల్సి వస్తోంది. 90 సెంట్లు భూమి ఉన్న జంధ్యాల సుబ్రమణ్యానికి 49 సారలు (40 కిలోలు ఒక సార) దిగుబడి వచ్చింది. ఈ ధాన్యాన్ని 13 కిలోమీటర్ల దూరంలోని రైస్ మిల్లుకు తరలించాల్సి వచ్చింది. ట్రాక్టర్‌లో మిల్లుకు తరలించిన తర్వాత ఆన్‌లైన్ సమస్యలు ఏర్పడ్డాయి. దిగుమతికి 36 గంటలు ఆలస్యమైంది. రూ.3,700 ట్రాక్టర్ కిరాయి చెల్లించాల్సి వచ్చింది. ఒక్కో సారకు రూ.75 చొప్పున కిరాయి పడింది. ప్రభుత్వం సారకు రూ.10 చొప్పున 29 సారలకు రూ.250 మాత్రమే రైతుకు చెల్లిస్తుంది. మిగిలిన రూ.3,450 రైతు చెల్లించాల్సి వచ్చింది. ఘంటసాల మండలంలోని రైతులకు 35 కిలోమీటర్ల దూరంలోని కోడూరు, మచిలీపట్నం రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించాల్సి వస్తోంది. చల్లపల్లి-కోడూరు రోడ్డు అధ్వానంగా ఉండడంతో ధాన్యం రవాణాకు వాహన యజమానులు అదనపు కిరాయిలు తీసుకుంటున్నారు. ఐదు టన్నుల ట్రక్కుకు రూ.6 వేలు రైతులు చెల్లించాల్సి వస్తోంది.

ఆర్‌బికె సిబ్బంది సంచులు లేవంటున్నారు

నేను వరి కుప్పనూర్చి 25 రోజులకుపైగా అవుతోంది. ధాన్యాన్ని మిల్లుకు తరలించకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఆర్‌బికె సిబ్బంది సంచులు కొరతగా ఉందని చెబుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది.

-అన్నే శివప్రసాద్, పొణుకుమాడు గ్రామం, ఉంగుటూరు మండలం

ప్రతిభా పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, డొక్కా మాణిక్య వరప్రసాద్, ఐ. వెంకటేశ్వరరావు తదితరులు

సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులు

- ప్రతిభా పురస్కార సభలో ఎమ్మెల్సీ లక్షణరావు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థులలో సమాజం పట్ల అవగాహన పెంపొందించడానికి, బాధ్యతతో కూడిన పౌరులుగా ఎదిగేందుకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఎంతగానో దోహదపడతారని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. కెవిఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సోషల్ సైన్సెస్ ఉపాధ్యాయుల ప్రతిభా పురస్కార మహోత్సవం గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శుక్రవారం రాత్రి జరిగింది. కన్న విద్యా సంస్థల అధినేత కన్న మాస్టర్ అధ్యక్షతన జరిగిన సభలో లక్ష్మణరావు మాట్లాడుతూ.. గత నాలుగు దశాబ్దాలుగా విద్యా బోధనలో వచ్చిన సమూల మార్పుల కారణంగా విలువల స్థానంలో ఉపాధికి ప్రాధాన్యతనిచ్చే సైన్స్ అండ్ టెక్నాలజీ సబ్జెక్టులకు డిమాండ్ పెరిగిందన్నారు. ప్రప్రథమంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులను గౌరవించి సత్కరించే అవకాశం కెవిఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్ట్‌కు దక్కడం సంతోషంగా ఉందన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కెవిఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చేస్తున్న విద్యా సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పౌర శాస్త్ర అధ్యాపకులు నూతలపాటి వీర ప్రకాష్‌రావును విశిష్ట ప్రతిభ పురస్కారంతో సత్కరించడంతోపాటు 46 మంది సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కోఆర్డినేషన్ డైరెక్టర్ పి పార్వతి, విజిఎస్ పబ్లిషర్స్ అధినేత ఎస్ రామారావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.కళాధర్, ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శి కె.అలిన్, కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో వైసిపి నేతల చేరిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు సమక్షంలో పలువురు వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. వైసిపి యువజన విభాగం పల్నాడు జిల్లా కార్యదర్శి అంకాళ్ల రాంబాబు, కౌన్సిలర్ గుజ్జర్ల పూడి సతీష్, మాజీ ఎంపిటిసి మిరియాల వెంకటేశ్వర్లు, గుంటూరు జిల్లా వైసిపి మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షులు సయ్యద్ మహబూబ్ తదితరులకు అచ్చెన్నాయుడు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యాన టిడిపి కార్యాలయంలో శనివారం వారు పార్టీలో చేరారు.

ఆత్మస్తుతి పరనిందకు పాల్పడిన జగన్ : కళా వెంకట్రావు

భీమిలి సభలో సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆత్మస్తుతి, పరనిందకు పాల్పడ్డారని మాజీమంత్రి కిమిడి కళా వెంకట్రావు తెలిపారు. ధరలు, పెంచిన చార్జీలు, పన్నులు, అప్పుల బాదుడుతో ఒక్కో కుటుంబంపై రూ.8 లక్షల భారం మోపిన జగన్ పేదల ద్రోహి కాదా? అని శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. విశాఖలో రూ.40వేల కోట్ల విలువైన భూములు కబ్జాచేసి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని నాశనం చేసిన జగన్ ఉత్తరాంధ్ర ద్రోహి కాదా? అని ప్రశ్నించారు.

దోపిడీ సొమ్ముతో గెలవాలన్న జగన్ ఆశ అడియాసే : ప్రత్తిపాటి పుల్లారావు

దోచేసిన అవినీతి సొమ్ముతో ఎన్నికల్లో గెలవడానికి జగన్ సిద్ధమయ్యారని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. 'కార్యకర్తకు జగనన్న భరోసా' పేరుతో పులివెందులలో డబ్బు పంపిణీకి జగన్, ఎంపి అవినాష్ రెడ్డి తెరలేపారని పేర్కొన్నారు.

నాపై చర్యలకు ఉపక్రమించడం సరైంది కాదు : సి రామచంద్రయ్య

తనపై అమానవీయంగా, అన్యాయంగా, ఆవేశంతో చర్యలకు ఉపక్రమించడం సరైన విధానం కాదని టిడిపి నేత, ఎమ్మెల్సీ సి రామచంద్రయ్య అన్నారు. శాసనమండలి ఛైర్మన్ తనపై చర్యలు తీసుకునే ముందు రాజ్యాంగం ప్రకారం తనకు తగినంత వ్యవధి, తగిన అవకాశం ఇవ్వాలని కోరారు. పార్టీ మార్పుపై వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఛైర్మన్ కోరారని, నాలుగు వారాల వ్యవధి తాను కోరానని చెప్పారు.

మ్యానిఫెస్టోలలో సీమ అంశాలకు ప్రాధాన్యతనివ్వాలి

- రాయలసీమ నిజదర్శన దీక్షలో బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్

ప్రజాశక్తి - నంద్యాల

రాబోయే శాసనసభ ఎన్నికల్లో ఆయా రాజకీయ పార్టీల మ్యానిఫెస్టోలలో రాయలసీమ ప్రాంత అంశాలను తమ మ్యానిఫెస్టోలలో చేర్చి ప్రాధాన్యతనివ్వాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. నంద్యాల తాలూకా కార్యాలయం దగ్గర రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో న్యాయవాది భూమా కృష్ణారెడ్డి అధ్యక్షతన రాయలసీమ నిజదర్శన దీక్ష చేపట్టారు. దశరథరామిరెడ్డి మాట్లాడుతూ.. శ్రీబాగ్ ఒప్పందం కాలం నుంచి నేటి వరకు సీమ సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం ప్రకారం రాయలసీమలో రాజధాని లేదా హైకోర్టు, కృష్ణానది జలాలలో ప్రముఖ ప్రాధాన్యత, విద్యాసంస్థలు, శాసనసభ స్థానాలలో సమాన నిష్పత్తి తదితర అంశాల అమలుకు రాజకీయ పార్టీలు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. కృష్ణానది యాజమాన్య బోర్డులో వెనుకబడిన ప్రాంతాలకు నీటి వాటా పెంచాలని కోరారు. ఇందుకు సీమ ప్రజాసంఘాల పక్షాన పోరాటాలు చేస్తామని, అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. నాలుగు రోజుల్లో పూర్తిస్థాయి రాయలసీమ ప్రజామ్యానిఫెస్టోను విడుదల చేసి ఆయా పార్టీల అధ్యక్షులకు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

ప్రజాశక్తి -తిరుమల : వరుసగా మూడు రోజులు సెలవుదినాలు రావడంతో తిరుమల కొండ యాత్రికులతో కిటకటలాడుతోంది. శ్రీవారి దర్శనం కోసం వైకుంఠ క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు నిండిపోయాయి. రూ.300 ప్రత్యేక దర్శనంలో సుమారు నాలుగు గంటలు, టోకెన్లు లేని వారికి సుమారు 20 గంటల సమయం పడుతుంది. యాత్రికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అందుకు తగిన ఏర్పాట్లను టిటిడి అధికారులు చేశారు.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో పెరగనున్న ఎల్ఐసి వాటా

ముంబయి : ప్రయివేటు రంగంలోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో దిగ్గజ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) తన వాటాను పెంచుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతించింది. 2025 జనవరి 24 నాటికి హెచ్‌డిఎఫ్‌సిలో ఎల్ఐసి తన వాటాను 9.99 శాతానికి పెంచుకోవడానికి అవకాశం కల్పించింది. 2023 డిసెంబర్ ముగింపు నాటికి 5.19 శాతం వాటాను కలిగి ఉంది. మరో 4.8 శాతం వాటాలను పెంచుకోవడానికి వీలు కల్పించినట్లయ్యింది.

యుద్ధానికి నేను రెడీ

- మీరు రెడీనా అంటూ షర్మిల సవాలు
- బిజెపికి జగనన్న బానిస

సమావేశంలో మాట్లాడుతున్న షర్మిల

ప్రజాశక్తి - ఒంగోలు బ్యూరో, నెల్లూరు

'రాజశేఖర్‌రెడ్డి బిడ్డగా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు కాపాడేందుకు నేను ఎపికి వచ్చాను. తెలంగాణా మెట్టినిల్లయితే ఎపి పుట్టినిల్లు. ఇక్కడ ఎవరూ భయపడేది లేదు. యుద్ధానికి నేను రెడీ..మీరు రెడీనా అని' పిసిసి అధ్యక్షులు వైఎస్. షర్మిల సవాలు విసిరారు. నెల్లూరు, ఒంగోలులో నిర్వహించిన పార్టీ సమావేశాల్లో ఆమె మాట్లాడారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి పాలనకూ, జగనన్న పాలనకూ నక్కకు నాగలోకానికి ఎంత తేడా ఉందో అంత తేడా ఉందన్నారు. ఆయన వారసులుగా చెప్పుకుంటూ ఏం చేశారో ఆలోచించాలన్నారు. వైఎస్ఆర్ అంటే వైవి. సుబ్బారెడ్డి, సాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డిగా ఉందని ఎద్దేవా చేశారు. మద్యపాన నిషేధం అమలు చేశాకే ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని చెప్పిన జగనన్న ఇప్పుడు ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. ఐదేళ్లలో ఒక్క పరిశ్రమ రాలేదని, జిల్లాకు ఓ ఎయిర్‌పోర్టు, బోయింగులు తిప్పుతామన్నారు... అన్నీ గాలికి పోయాయని విమర్శించారు. 'వైసిపిలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి లేరు.. ఇదొక నియంత పార్టీ. ప్రజా సమస్యలు పట్టడం లేదు. ప్రజల ప్రయోజనాలను బిజెపికి తాకట్టు పెట్టారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి బిజెపికి వ్యతిరేకం. ఎందుకంటే బిజెపి మతతత్వపార్టీ. ఒక వంతాన్ని రెచ్చగొట్టడం.. మరో మతాన్ని అవమానించడం. ఇదే బిజెపి రాజకీయ నైజం' అని ధ్వజమెత్తారు. జగనన్నతోపాటు చంద్రబాబు, పవన్ కలిసి రాష్ట్ర ప్రయోజనాలను బిజెపికి తాకట్టుపెట్టారని మండిపడ్డారు. రాష్ట్రంలో బిజెపి అంటే బాబు, జగన్, పవన్ అంటూ చమత్కరించారు. వీళ్లకు ఓట్లేస్తే బిజెపికి వేసినట్లేనని, వీరికి ఓట్లేయడం మళ్లీ బిజెపికి బానిసలు కావడం ఎందుకని ప్రశ్నించారు. వెలిగొండ ప్రాజెక్టును వైఎస్ 60 శాతం పూర్తిచేస్తే... తర్వాత చంద్రబాబు గానీ, ఇప్పుడు జగన్‌గానీ ఎందుకు పూర్తిచేయలేదన్నారు. గంగవరం పోర్టును 20 ఏళ్లలో ప్రభుత్వానికి వచ్చేలా వైఎస్ నిర్ణయం తీసుకుంటే ఇప్పుడు దాన్ని అమ్మగా వచ్చిన రూ.600 కోట్లను వేరే పోర్టులకు వినియోగించినట్లు చెబుతున్నారన్నారు. ఐదేళ్లలో రూ. ఎనిమిది లక్షల కోట్లు అప్పులు తెచ్చి ఎందుకు ఖర్చు పెట్టారని ప్రశ్నించారు. రూ. 55వేల కోట్లు ఖర్చుపెడితే పోలవరం పూర్తయ్యేది కదా? అని అన్నారు. రాష్ట్రం ఏర్పడే నాటికి లక్షా ఎనభై వేల కోట్ల రూపాయలు అప్పు ఉంటే, టిడిపి మరో లక్షా ఎనభై వేల కోట్లు టిడిపి అప్పు చేసిందని, వైసిపి ఏకంగా రూ. ఎనిమిది లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రం రూ.11.60 వేల కోట్లు అప్పుల్లో ఉందని తెలిపారు. ఇంత అప్పు తీసుకొచ్చి రాష్ట్రాన్ని ఎంత మేరకు అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. వైఎస్ హయాంలో పూర్తిచేసిన గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్వహణ కోసం కూడా నిధులు ఇవ్వనందునే దాన్ని గేట్లు కొట్టుకుపోయాయన్నారు. మాజీ ఎంపి జెడి. శీలం, ప్రసాదరావు, శ్రీపతిప్రకాశం మాట్లాడారు. అంతకుముందు కాంగ్రెస్‌పార్టీ నేతలతో కలిసి గుండ్లకమ్మ ప్రాజెక్టును సందర్శించి దెబ్బతిన్న గేట్లను షర్మిల పరిశీలించారు.

యెస్ బ్యాంక్ లాభాల్లో 350% వృద్ధి

ముంబయి : ప్రయివేటు రంగంలోని యెస్ బ్యాంక్ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 349.7 శాతం వృద్ధితో రూ.231.6 కోట్ల నికర లాభాలు సాధించింది. 2022-23 ఇదే త్రైమాసికంలో రూ.51.5 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2023 డిసెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు యథాతథంగా 2 శాతంగా, నికర నిరర్థక ఆస్తులు మెరుగుపడి 0.9 శాతానికి తగ్గాయి. గడిచిన క్యూ3లో నికర వడ్డీపై ఆదాయం 2.3 శాతం పెరిగి రూ.2,016 కోట్లుగా నమోదయ్యింది.

పిఎన్‌బి లాభాలు మూడు రెట్లు

ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) 2023-24 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో మూడు రెట్ల వృద్ధితో రూ.2,222.8 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.253.49 కోట్ల లాభాలు నమోదు చేసింది. పిఎన్‌బి నికర వడ్డీపై ఆదాయం 12.13 శాతం వృద్ధితో రూ.10,293 కోట్లుగా చోటు చేసుకుంది. 2023 డిసెంబర్ 31 నాటికి భారత్‌లో 10,108 శాఖలు, 12,455 ఎటిఎం కేంద్రాలు, 29,768 బిజినెస్ కరస్పాండెంట్లను కలిగి ఉంది.

యశోదలో "క్రిటికల్ కేర్ నెఫ్రాలజీ"పై అంతర్జాతీయ సదస్సు

- ప్రారంభించిన గవర్నర్ తమిళిసై
- కిడ్నీ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - హైదరాబాద్

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మూత్రపిండాల గాయం (ఎకెఐ) గణనీయంగా తగ్గింది. అయినప్పటికీ గర్భస్థ పిండం మరణాలు, గర్భధారణలో వ్యక్తి అనారోగ్యం ఒక ముఖ్యమైన సమస్యగానే ఉంది. అలాగే, మూత్రపిండాల వ్యాధులపై ప్రజలకు అవగాహన లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గర్భధారణ సమయంలో వచ్చే మూత్రపిండాల సమస్యలు, వాటికి అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక వైద్య విధానాలు, ఆ సమయంలో చికిత్స ఎలా అందించాలనే దానిపై హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మూడ్రోజుల అంతర్జాతీయ సదస్సు శనివారం ప్రారంభమైంది. యూఎస్ఎ, యూకే, యూరప్, లాటిన్ అమెరికాల నుంచి 30 మంది అగ్రశ్రేణి కిడ్నీ వైద్య నిపుణులు వచ్చిన ఈ సదస్సును రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ఒకప్పుడు కిడ్నీ వ్యాధులపై ప్రజలకు అవగాహన చాలా తక్కువని, దీనిపై వారికి అర్థం అయ్యేలా చెప్పడం చాలా కష్టంగా ఉండేదని అన్నారు. ప్రజల్లో అవగాహన లేక కిడ్నీ సమస్యలను కూడా సాధారణ సమస్యలుగా భావించి స్థానిక వైద్యులను సంప్రదిస్తున్నారని కానీ నెఫ్రాలజీలని కలవడం లేదని అన్నారు. కిడ్నీ సమస్యలపై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. వైద్య చికిత్సల కోసం ప్రజలు ఎంతో డబ్బు ఖర్చు పెట్టాల్సి వస్తోందని, అలాంటి వారికి ఆయుష్మాన్ భారత్ ఒక వరం లాంటిదని అన్నారు. వైద్య వృత్తి ఎంతో నమ్మకాన్ని కల్పిస్తుందని, తాను తెలంగాణ గవర్నర్‌గా వచ్చినప్పుడు కొత్త రాష్ట్రాన్ని ఎలా మేనేజ్ చేస్తుందని అన్నారని, కానీ తాను గైనిక్ డాక్టర్‌నని, తప్పకుండా మేనేజ్ చేయగలనని తన సన్నిహితులతో అన్నట్టు గుర్తు చేసుకున్నారు. వైద్య వృత్తిలో ఉన్న వారు ఓపికగా ఉండాలని వైద్యులకు సూచించారు. వైద్యవిజ్ఞాన శాస్త్రంలో చోటుచేసుకుంటున్న సరికొత్త ఆవిష్కరణలపై దృష్టిసారించేందుకు.. వివిధ దేశాల వైద్య నిపుణుల మధ్య వైద్యవిజ్ఞానాన్ని పంచుకోవడానికి ఈ సదస్సు వేదికగా నిలిచిందని అన్నారు. క్రిటికల్ కేర్ నెఫ్రాలజీపై అత్యాధునిక అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్న యశోద యాజమాన్యాన్ని అభినందించారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జుత్తిగ నరసింహమూర్తి

తణుకులో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ

- జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - తణుకు రూరల్ (పశ్చిమగోదావరి జిల్లా)

ఈ నెల 30, 31 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణంలో జరగనున్న ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి పిలుపునిచ్చారు. ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహామూర్తి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం ఏర్పడి 80 సంవత్సరాలైందని, సంఘం పుటినిల్లు అయిన పశ్చిమగోదావరి జిల్లాలో రాష్ట్ర మహాసభ నిర్వహించనున్నడం గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘం అధ్యక్షులు కామన మునిస్వామి, జిల్లా నేతలు గుబ్బల వీరరాఘవులు, కడలి పాండు, బొక్కా చంటి, సత్యనారాయణ, కాసాని శ్రీనివాసులు, కట్టా వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి మహంకాళి తదితరులు పాల్గొన్నారు.

అనురాగ్ వర్సిటీ ప్రవేశాలకు దరఖాస్తులు



హైదరాబాద్ : ఇంజనీరింగ్, అగ్రికల్చర్, నర్సింగ్ ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్ల కోసం అనురాగ్ యూనివర్శిటీ తన కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌ను ప్రకటించింది. ఇందుకోసం అనురాగ్ సెట్ 24 ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు పేర్కొంది. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ .6.5 కోట్ల స్కాలర్‌షిప్‌లను అందించనున్నట్లు అనురాగ్ యూనివర్శిటీ సిఇఒ ఎస్ నీలిమ తెలిపారు. శనివారం నగర శివార్లలోని వెంకటాపురంలోని క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నీలిమ మాట్లాడుతూ.. ప్రతిభను ఆకర్షించడంతోపాటు సమాజానికి, దేశానికి అర్థవంతమైన సహకారం అందించడమే తమ స్కాలర్‌షిప్ కార్యక్రమం లక్ష్యమని అన్నారు. అనురాగ్‌సెట్ 2024 ఫిబ్రవరి 11న ఆన్‌లైన్ పరీక్షతో ప్రారంభమవుతుంది. దరఖాస్తులకు చివరి తేదీ ఫిబ్రవరి 10గా నిర్ణయించామన్నారు.

ఎఫ్‌టిసిసిఐలో ఎగుమతులు, దిగుమతులపై సర్టిఫికెట్ ప్రోగ్రాం

హైదరాబాద్ : ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టిసిసిఐ) "ఎగుమతి, దిగుమతుల నిర్వహణపై సర్టిఫికెట్ ప్రోగ్రామ్"ను ప్రారంభించినట్లు ప్రకటించింది. వాణిజ్యపరిశ్రమల మంత్రిత్వ శాఖ స్పాన్సర్ చేసిన ఈ ఆరు రోజుల ప్రోగ్రామ్‌కు తోలు పరిశ్రమకు చెందిన 67 మంది వ్యాపార యజమానులను అంతర్జాతీయ వాణిజ్యంలో అవసరమైన నైపుణ్యాలు, పరిజ్ఞానంతో సన్నద్ధం చేయడానికి ఏర్పాటు చేయబడింది. శనివారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎఫ్‌టిసిసిఐ ప్రెసిడెంట్ మీలా జయదేవ్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక పరిస్థితిలో సామర్థ్య పెంపుదల ప్రాముఖ్యతను తెలిపారు.

Chola Enter a better life

చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

కార్పోరేట్ ఆఫీసు: చోలా క్రెస్ట్, సూపర్ బి, సి54 మరియు సి55, 4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032. టి.ఎన్.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 (రూల్స్) మరియు సెక్యూరిటైజేషన్ మరియు రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్స్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 ("చట్టం") యొక్క నిబంధనల క్రింద

దిగువసంతకందారు అయిన చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి (సెక్యూర్డ్ క్రెడిటార్) చట్టంలోని సెక్షన్ 13(12) కింద అందించబడిన అధికారాలను అమలు చేస్తూ, నిబంధన 3తో చదివిన సెక్షన్ కింద డిమాండ్ నోటీసు(లు) జారీ చేయబడింది. చట్టంలోని 13 (2) పేర్కొన్న నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు సంబంధిత నోటీసు (ల)లో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా రుణగ్రహీత(లు)ని పిలవడం జరిగింది. రుణగ్రహీత (లు) డిమాండ్ నోటీసు (ల) సేవలను తప్పించుకుంటున్నారని/ నివారిస్తున్నారని దిగువ సంతకం చేసిన వారు సహేతుకంగా విశ్వసిస్తున్నారు. కాబట్టి నిబంధనల ప్రకారం అనుబంధం చేయడం మరియు ప్రచురించడం ద్వారా నోటీసు సేవ ప్రభావితమవుతుంది. డిమాండ్ నోటీసు(ల)లోని విషయాలు ఇక్కడ దిగువన సంగ్రహించబడ్డాయి.

క్ర. సం	రుణగ్రహీత/సహ-రుణగ్రహీతల పేరు మరియు చిరునామా	రుణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది మరియు బాకీపడిన మొత్తం	సెక్యూర్డ్ అసెట్/ ఆస్తి వివరణ
1.	1) రుణ ఖాతా నెం. **HL05RAS000003829** 1) పరుచూరి కృష్ణకుమారి, 2. పూర్ణచంద్ర పరుచూరి ఇరువురి నివాసం: డో.నం.1-133, ఆంజనేయస్వామి గుడి వద్ద, పెదకురపాడు-522 402, ఎ.పి., ఇక్కడ కూడా : డో.నం.1-133, ఎస్.నం.692, బుచ్చయ్యపాలెం, ఆంజనేయస్వామి గుడి వద్ద, పెద్దకురపాడు-522 402, ఎ.పి.	₹ 22,55,884/-	22.01.2024 రూ.30,50,599/- (ముప్పై లక్షల యాభై వేల ఐదు వందల తొంభై తొమ్మిది రూపాయలు మాత్రమే) 18.01.2024 నాటికి **పునర్నిర్మించిన మొత్తం** ₹ 23,53,260/-	గుంటూరు జిల్లా, నరసరావుపేట జిల్లా రిజిస్ట్రీ, పెద్దకురపాడు ఉపజిల్లా, పెద్దకురపాడు మండలం, బుచ్చయ్యపాలెం గ్రామ పంచాయతీ, పెద్దకురపాడు గ్రామం వద్ద ఉన్న ఆస్తి మొత్తం ఆ భాగం మరియు పార్శిల్ డో.నం.692/ఎ బయట ఎసి. 353 సెంట్లు, ఆ ఎసి. 1-03 సెంట్లు, ప్లాట్లుగా విభజించబడిన మరియు ప్లాట్ నం.3 ప్లాన్ ప్రకారం సైట్ విస్తీర్ణం 241 చ.గ.లు. తో ఆర్.సి.సి. ఇంటి నిర్మాణం క్రింద (ప్లాన్ ప్రకారం) తో అన్నీ ఫిక్చర్లు మరియు దానిపై ఫిట్టింగులు, హద్దులు : తూర్పు : ప్లాట్ నం.4 సైట్ 70.0 అ.లు., దక్షిణం : చెరుకూరి సరస్వతి స్థలం 31.0 అ.లు., పడమర : ప్లాట్ నం.2 సైట్ 70.0 అ.లు., ఉత్తరం : 30 అ.లు. వెడల్పు రోడ్డు 31.70 అ.లు.

రుణగ్రహీత(లు) డిమాండ్ నోటీసు (లు)కు కట్టుబడి ఉండాలని మరియు ఈ ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోపు వర్తించే వడ్డీ, అదనపు వడ్డీ, బౌన్స్ ఛార్జీలు, ఖర్చులు మరియు ఖర్చులతోపాటు అందులో పేర్కొన్న డిమాండ్ మొత్తాన్ని చెల్లింపు యొక్క సాక్షాత్కార తేదీ వరకు చెల్లించాలని దీని ద్వారా సూచించారు. చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ సురక్షిత రుణదా అని మరియు రుణగ్రహీత (లు) పొందే రుణ సదుపాయం స్థిరాస్తి/ ఆస్తులు తనఖాగా ఉంచిన సురక్షి ఆస్తి (లు)కి వ్యతిరేకంగా సురక్షి రుణం అని రుణగ్రహీత (లు) గమనించవచ్చు. రుణగ్రహీతలు నిర్ణీ గడువులోగా తమ బాధ్యతలను పూర్తి చేయడంలో విఫలమైతే, సురక్షితమైన ఆస్తులు (లు) స్వాధీనం చేసుకోవడానికి చట్టంలోని సెక్షన్ 13 (4) ప్రకారం అన్ని హక్కులను వినియోగించుకోడానికి సురక్షి రుణదాకు అర్హత ఉంటుంది. విక్రయం ద్వారా చట్టం మరియు దాని క్రింద ఉన్న నిబంధనల ప్రకారం అందుబాటులో ఉన్న ఏదైనా ఇతర పరిష్కారాన్ని అమలు చేయడం ద్వారా మరియు ద్వారా వాటిని బదిలీ చేయడానికి మాత్రమే పరిమితం కాకుండా. సురక్షిత రుణదాతకు అమ్మకం లేదా బదిలీ హక్కును అమలు చేయడానికి ముందు సురక్షి ఆస్తులు(లు) **అటాచ్ మరియు/లేదా సీల్** చేయడానికి కూడా అధికారం ఉంది. సురక్షిత ఆస్తుల (ల) విక్రయం ర్వా, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెల్లించాల్సిన బకాయిలను కవర్ చేయడానికి తనఖా పెట్టబడిన ఆస్తుల విలువ సరిపోకపోతే, బ్యాలెన్స్ బకాయిలను తిరిగి పొందటానికి ప్రత్యేక చట్టపరమైన చర్యలను ప్రారంభించే హక్కు కూడా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఉంది. ఈ పరిహారం అదనంగా మరియు ఏదైనా ఇతర చట్టం ప్రకారం సెక్యూర్డ్ క్రెడిటార్‌కు అందుబాటులో ఉన్న అన్ని ఇతర నివారణలకు స్వతంత్రంగా ఉంటుంది.

అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13(8) కి, సురక్షిత ఆస్తులను మరియు చట్టంలోని సెక్షన్ 13(13)కి రుణగ్రహీతల దృష్టిని ఆహ్వానిస్తున్నారు. దీని ద్వారా రుణగ్రహీత (లు) సురక్షిత ఆస్తి (ల)ను పాడు చేయడం లేదా వాటితో వ్యవహరించడం లేదా అమ్మకం, లీజు లేదా ఇతరత్రా (సాధారణ వ్యాపారంలో కాకుండా) ఏదైనా సురక్షి ఆస్తి(ల) యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా బదిలీ చేయడం నుండి నిరోధించబడింది/ నిషేధించబడింది సెక్యూర్డ్ క్రెడిటార్ మరియు పైన పేర్కొన్న వాటిని పాటించకపోవడం, పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 29 ప్రకారం శిక్షార్హమైన నేరం. డిమాండ్ నోటీసు కాపీ కింద సంతకం చేసిన వారి వద్ద అందుబాటులో ఉంటుంది మరియు రుణగ్రహీత (లు) వారు కోరుకున్నట్లయితే, సాధారణ కార్యాలయ వేళల్లో ఏదైనా పని దినాన దిగువ సంతకం చేసిన వారి నుండి సేకరించుకోవచ్చును.

ప్రదేశం: గుంటూరు, ఆంధ్రప్రదేశ్
తేది: 22.01.2024

సం/-
అధీకృత అధికారి
మెసెర్స్ చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్., తరపున

సంపాదకీయం

పరిశుభ్రత

శుభ్రత-ఆరోగ్యం... అందానికి రెండు కళ్ళు. దుమ్ము, ధూళి నిండిన ప్రపంచంలో పరిశుభ్రత ఒక తాజా పరిమళం. ఇది వ్యాధుల నుంచి దూరంగా వుంచుతుంది. జీవితాలను సంతోషమయం చేస్తుంది. శుభ్రత అంటే చేతులు కడుక్కోవడమో, స్నానం చేయడమొక్కటే కాదు... మన పరిసరాలను కూడా శుభ్రంగా వుంచుకోవడం. ఇది ఆరోగ్యం నిండిన ప్రపంచానికి ఒక ఆనవాలు. 'శుభ్రత విలాసం కాదు... అవసరం. ఆరోగ్యకరమైన, సంతోషకరమైన జీవితానికి పరిశుభ్రత తొలిమెట్టు' అంటాడో రచయిత. ఎంత మంచి ఆహారమైనా పరిశుభ్రంగా లేకపోతే... అనారోగ్యానికి దారితీస్తుంది. అతిసార, శ్వాసకోస వంటి వ్యాధులతో ప్రతి ఏడాది ప్రపంచవ్యాప్తంగా అనేకమంది పిల్లలు చనిపోతున్నారు. దీనికి కారణం పరిసరాలు శుభ్రంగా లేకపోవడమేనని ప్రపంచ ఆరోగ్యసంస్థ చెబుతోంది. ఒక్క చేతులు శుభ్రపరుచుకుంటేనే... దాదాపు 50శాతం పైగా అతిసార సంబంధిత వ్యాధులు, 20 నుంచి 30 శాతం శ్వాస సంబంధిత వ్యాధులను నివారించవొచ్చునని వైద్య నిపుణులు చెబుతున్నారు. 'నీ శరీరం ఒక దేవాలయం. దానిని శుభ్రంగా వుంచుకో' అంటారు బికెఎస్ అయ్యంగార్. స్వచ్ఛ భారత్ అభియాన్ వంటి ప్రచారాలు ఎన్ని వచ్చినా... పల్లెల నుంచి మహానగరాల వరకూ అపరిమితమైన చెత్త, ధూళి పేరుకుపోతోంది. ఇది పర్యావరణానికి హానికరంగా మారింది.

నేడు మన దేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్లో పేరుకుపోతున్న చెత్త, వ్యర్థ పదార్థాలను ప్రధానంగా చెప్పుకోవాలి. వీధులు, పార్కులు, బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం ఉండడం సర్వసాధారణం. దీనివల్ల పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లుతోంది. వీధుల్లో చెత్త వేయడమే కాకుండా బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయడం, మల మూత్ర విసర్జన చేయడం వంటివి కూడా పరిసరాల అశుభ్రతకు కారణమౌతున్నాయి. పరిశుభ్రత కేవలం భౌతిక పరిసరాలకే పరిమితం కాదు. ఇందులో వ్యక్తిగత పరిశుభ్రత కూడా ఉంటుంది. వ్యాధుల వ్యాప్తిని నిరోధించడానికి, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడానికి పరిశుభ్రతను పాటించడం అవసరం. 'పరిశుభ్రత అనేది పరిపూర్ణ ప్రమాణాల యొక్క ముఖ్య లక్షణం. అత్యుత్తమ నాణ్యతా ప్రమాణం' అంటారు గాంధీజీ. అయితే, కంటికి కనిపించని రెండో కోణం కూడా వుంది. అదే, పారిశుధ్య కార్మికుల నిరంతర శ్రమ. తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా వీధులను, ఇళ్లను శుభ్రం చేసే పనిలో వారి జీవితాలను మైనంలా కరిగిస్తుంటారు. మాన్యువల్ స్కావెంజర్లది మరీ దయనీయమైన గాథ. గత ఐదేళ్ల కాలంలో సెప్టిక్ ట్యాంక్‌ల్లో పడి, మురుగు కాల్వల్లో పడి 399 మంది మాన్యువల్ స్కావెంజర్లు చనిపోయారని ప్రభుత్వ అధికారిక సమాచారం. ఊళ్లు, నగరాల పరిశుభ్రత కోసం వీళ్ల జీవితాలను ఫణంగా పెడుతున్నారు. అయినా లభించేది అరకొర వేతనాలే. ఇటీవల పారిశుధ్య కార్మికులు వేతనాలు పెంచాలని సమ్మె చేయాల్సి వచ్చింది. చివరకు రాష్ట్రప్రభుత్వం దిగొచ్చినా...ఏ మేరకు వారి అవసరాలు తీర్చుతారనేది చూడాల్సిందే.

పరిశుభ్రత ఆవశ్యకత, ప్రయోజనాల గురించి తెలిసినప్పటికీ, మన దేశం ఈ సమస్యతో పోరాడుతూనే ఉంది. 'స్వచ్ఛభారత్' పథకం... ప్రకటనలకే పరిమితమైంది. వీధుల్లో చెత్తాచెదారం, పొంగిపొర్లుతున్న చెత్త కుండీలు, అపరిశుభ్రంగా ఉన్న పబ్లిక్ టాయిలెట్లు నిత్యం కనిపించే దృశ్యం. చిన్నపాటి వర్షం వచ్చినా...రోడ్లన్నీ అశుద్ధంతో నిండుకుంటాయి. ఈ నేపథ్యంలోనే ప్రతి యేటా జనవరి 30న 'జాతీయ పరిశుభ్రత దినోత్సవం' నిర్వహిస్తున్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా, ఆరోగ్యంగా వుంచుకోవడం ప్రాథమిక కర్తవ్యంగా గుర్తు చేసేందుకు ఈ వేడుకను నిర్వహిస్తారు. ఇంటి నుంచి పని ప్రదేశం వరకు పరిసరాలను శుభ్రంగా వుంచడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తారు. 'ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముంగిలి శుభ్రంగా వుంచుకుంటే... దేశమంతా శుభ్రంగా వుంటుంది' అంటారు మదర్ థెరిస్సా. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామని ప్రతిజ్ఞ చేయాల్సిన సమయం ఇది. అందరం చేయి చేయి కలుపుదాం...మన పరిసరాలను పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా మార్చుకోడానికి కృషి చేద్దాం.

మహనీయుల మాట



ప్రజల చైతన్యంలో మనం నాటిన విత్తనాలు మొలకెత్తకుండా ఎల్లకాలం ఉండబోవు. చరిత్ర మనది. ప్రజలే చరిత్ర నిర్మాతలు.

- సాల్వడార్ అలెండీ,
అమెరికా కుట్రలకు బలైన చిలీ అధ్యక్షుడు, కమ్యూనిస్టు నేత.

అయోధ్య సంకేతాలు-అవకాశవాద స్తోత్రాలు

ఆర్ఎస్ఎస్ అధినేత సహా ప్రధాని మోడీ అయోధ్యలో రామ మందిర ప్రాణ ప్రతిష్ట నిర్వహించడంతో భారత రాజకీయాల్లో నవశకం మొదలైందని మీడియా అభివర్ణిస్తున్నది. మరో వైపున బిబిసి, అల్‌జజీరా, ఎకనామిస్ట్ వంటి విదేశీ మీడియా సంస్థలు బాబ్రీ మసీదు కూలగొట్టిన చోటనే రామమందిరాన్ని ప్రధాని స్వయంగా ప్రారంభించడం మత రాజకీయాల్లో మరో కొత్త మలుపు అని పతాక శీర్షికలిచ్చాయి. తాము లౌకిక వాదులమైనప్పటికీ మతతత్వ రాజకీయాలను సూటిగా ఎదర్కొనలేని వ్యాఖ్యాతలు, మేధావులు కూడా అటూ ఇటూ తిప్పి మాట్లాడుతూ బిజెపికి కోపం రాకుండా జాగ్రత్త పడుతున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రముఖ నటులు చిరంజీవి వంటి వారు ఆ వేడుకలో కనిపించారు. అక్కడ ప్రత్యక్షమైన బిజెపి యేతర రాజకీయ నేత చంద్రబాబు ఒక్కరేనని మీడియా గమనించింది. పవన్ కళ్యాణ్ కూడా వెళ్లడమే గాక అయోధ్య కోసం ఏదైనా చేస్తానని ప్రకటించారు. ఇక ఎ.పి ముఖ్యమంత్రి జగన్ రాజకీయంగా బిజెపిని బలపర్చేవారైనా అక్కడకు వెళ్లలేదు. ఆయనను పిలిచినట్టు కూడా కనిపించలేదు. ఏమైనా మూడు పార్టీలు బిజెపితో వున్న రాష్ట్రంగా ఎ.పి మాత్రమే కనిపిస్తుంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాలు అధికారికంగానే ఆహ్వానం తిరస్క రించారు గనక తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అక్కడకు వెళ్లలేదు. భద్రాచలంలో రామాలయానికి అయోధ్య రామాలయానికి తేడా ఏమీ లేదని వ్యాఖ్యానించారు. రాముడిపై భక్తి విషయమే అయితే రేవంత్ మాటలు పూర్తిగా వాస్తవమని చెప్పాలి. కానీ అయోధ్యలో అంతకు మించి జరిగింది.



తెలకపల్లి రవి

కేవలం హిందూ విశ్వాసమేనా?

వరుసగా చూసినప్పుడు ఈ పరిణామాలు పూర్తిగా బిజెపి దిశలో వున్నట్టు, అయోధ్యతో అవి తిరుగు లేనివిగా మారినట్టు ఎవరైనా భావిస్తే ఆశ్చర్యంలేదు. వాస్తవానికి మీడియాలో చాలా మంది ఆ విధమైన చిత్రణే ఇస్తున్నారు. మోడీని అజేయుడని రాసిన, చెప్పిన వాళ్ల పేర్లు చూస్తే మనకు ఆశ్చర్యం కలుగుతుంది. ప్రజాస్వామ్యవాదులుగా ఉదారవాదులుగా పేరున్నవారు కూడా హిందూత్వను వ్యతిరేకిస్తే తమను దూరం పెడతారనీ ముద్ర వేస్తారనీ వెనకడుగు వేస్తున్న స్థితి చూస్తాం. విద్యాధికులు ఉన్నత స్థానాల్లోవారు కూడా పథకం ప్రకారం ముందుకు తెచ్చిన ఈ రాజకీయాలకు తల వంచుతున్నారు. తలపడటానికి నిరాకరిస్తున్నారు. వాస్తవంలో లౌకికవాదులు లేదా వామపక్షాలు ఏనాడూ రామభక్తిని గానీ ఆలయాలను గానీ అవహేళన చేయలేదు. భక్తి విశ్వాసాలు వారి వారి వ్యక్తిగత అంశాలుగా మాత్రమే వుండాలన్నది ఇక్కడ కీలకాంశం. అలాగే భిన్న మతాలతో కూడిన ఈ దేశంలో అన్ని మతాలకు సమాన గౌరవం వుండాలనీ, అల్ప సంఖ్యాక మైనార్టీ మతాలకు ప్రత్యేక సదుపాయాలు, రక్షణ కూడా వుండాలనీ రాజ్యాంగంలోని 25-30వ అధికరణాలు స్పష్టంగా చెబుతున్నాయి. లౌకికతత్వం, మత సామరస్యం వుండాలంటే మతతత్వంపై పోరాడవలసిందే, ఖండించవలసిందే. మతానికి మతతత్వానికి మధ్య వుండే పెద్ద తేడాను కప్పి పుచ్చి ఇదేదో రామభక్తికి సంబంధించిన సమస్యగా చూపించడం సంఘ పరివార్ పాచికే. హిందూ మతం పేరిట హిందూత్వ చలామణి కావడానికి మీడియా ప్రచారాలు కూడా తోడైనాయి. హిందూత్వ వీరసావర్కార్ సృష్టించిన పదం మాత్రమే తప్ప ప్రాచీన సంప్రదాయం కాదు. నిజానికి రామభక్తిలోనూ కృష్ణతత్వంలోనూ కూడా ఉత్తర దక్షిణ భారతీయుల విశ్వాసాల్లో చాలా తేడాలున్నాయి. ఈ విద్వేషాలను తొలగించడానికే తిక్కన హరిహర దేవుణ్ని సృష్టించాల్సి వచ్చింది. కనక ఒకసారి మతాల మధ్య తేడాలను, రాజకీయాలను అనుమితిస్తే తర్వాత ఆయా మతాలు, కులాల మధ్య కూడా వివాదాలు రావడం అనివార్యం. ముస్లిం దేశాలలో షియాలు సున్నీల మధ్య, క్రైస్తవులలో ప్రొటెస్టంట్లు, క్యాథలిక్కుల మధ్య వివాదాలు చూస్తాం. కనుక కేవలం మతం ప్రాతిపదికన ఎవరూ ఒక దేశాన్ని ఐక్యం చేయలేరు. మత ప్రాతిపదికన విడదీయబడిన పాకిస్తాన్ నుంచి భాష ప్రాతిపదికన బంగ్లాదేశ్ విడిపోవడం దీనికో ఉదాహరణ. యాభై ఏళ్ల స్వతంత్ర భారతంలో 1998లో బిజెపి అధికారం చేపట్టిన తర్వాత హిందూత్వ పునరుద్ధరణ వాదం పెంచిన ఫలితంగానే ఈ గుళ్లూ గోపురాల చుట్టూ రాజకీయాలు తిరగాల్సి వస్తోంది. పి.వి నరసింహారావు ఎంతో తెలివైన వారు గనక బాబ్రీ తొలగించబడితే ఆ సమస్యే వుండదని కొందరు ఇప్పటికీ చెబుతుంటారు. కానీ వారణాసి జ్ఞానవాపి మసీదు కింద ఆలయ శిథిలాలు దొరికాయంటూ తాజాగా మొదలైన అలజడి చూస్తే వారి వాదన ఎంత తప్పో తెలుస్తుంది. ఈ తరుణంలోనే మధుర కృష్ణ జన్మస్థాన్ కేసు కూడా అలహాబాద్ హైకోర్టు విచారణకు చేపట్టింది. మత చిచ్చులకు మొదలే గానీ ముగింపు వుండదు. ఈ క్రమంలో మతాల గురించి, వాటిని అనుసరించే మనుషుల గురించి ఇష్టానుసారం ప్రచారాలు చేస్తూ విద్వేషాలు పెంచుకోవడం విశాల భారతావనికి విపత్కరమే. మత చిచ్చులకు మొదలే గానీ ముగింపు వుండదు.

మోడిఫికేషన్- రామిఫికేషన్

గత చరిత్రలో జరిగిందని చెబుతున్న తప్పును చక్కదిద్దడం పేరిట ఒక మత కట్టడాన్ని కూల్చి మరొకటి నిర్మించడం అదేదో అయిపోయిందిలే అనుకునే వాళ్లకు కనువిప్పు. ప్రాణ ప్రతిష్ఠకు ముందు మోడీ పదకొండు రోజుల నుంచి ఉపవాస దీక్ష చేయడం మీడియాలో సవివరంగా ప్రసారమైంది. ఎ.పి లో లేపాక్షి, తమిళనాడులో రామేశ్వరం సహా దక్షిణాదిలో రామాయణ కథలతో ముడిపడిన ప్రదేశాలను ప్రధాని అధికార హోదాలోనే సందర్శించి వివరాలు విడుదల చేశారు. ఆ విధంగా ఉత్తర దక్షిణ భారతాల మధ్య బిజెపి ఒక మత సేతువును కట్టే వ్యూహాత్మక ప్రయత్నం చేసింది. వీటన్నిటి తర్వాత రిపబ్లిక్ దినోత్సవ పెరేడ్‌లో ఉత్తర ప్రదేశ్ శకటం రామమందిర ఇతివృత్తంతో సాగింది. మోడీ రాజకీయాలను గతంలో మోడిఫికేషన్ అనటం కద్దు. ఆయన మొదటి దఫాలో అయోధ్య ప్రధాన అస్త్రంగా తీసుకోలేదు. రెండవసారి గెలిచాక కొన్నాళ్లకే సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు రావడం, తర్వాత కొన్నాళ్లకే కాశ్మీర్‌లో 370 అధికరణం రద్దు చేయడం కీలకాంశాలయ్యాయి. ఈ నాటికి రామమందిరం 2024 ఎన్నికల ఎజెండాగా మార్చబడుతున్నది. ఇదంతా ఒక క్రమపద్ధతిలో వ్యూహాత్మకంగా నడుస్తున్న రాజకీయమే తప్ప యాదృచ్ఛికం కాదు. ఎందుకంటే సమాంతరంగా బిజెపి ఎన్నికల సన్నాహాలు నడుస్తున్నాయి. హోంమంత్రి అమిత్ షా ఆదివారం తెలంగాణ సందర్శనకు వస్తున్నారు. ఎ.పి లోనూ టిడిపి, జనసేన కూటమిలోకి బిజెపి వస్తుందనే కథనాలు బలంగా వున్నాయి. తాజాగా పవన్ టిడిపిపై చేసిన వ్యాఖ్యానాల వెనక కూడా బిజెపి హస్తం వుందని ఆ పార్టీల వారే చెబుతున్నారు. వీటన్నిటి వెనక వ్యూహం ఎటు పోతున్నదో త్వరలోనే స్పష్టం అవుతుంది. దీన్ని ఇంగ్లీషు పదంతో రామిఫికేషన్ అంటున్నారు. అంటే ఒక విధాన ప్రతిధ్వనులు.

> **గత చరిత్రలో జరిగిందని చెబుతున్న తప్పును చక్కదిద్దడం పేరిట ఒక మత కట్టడాన్ని కూల్చి మరొకటి నిర్మించడం అదేదో అయిపోయిందిలే అనుకునే వాళ్లకు కనువిప్పు. ప్రాణ ప్రతిష్ఠకు ముందు మోడీ పదకొండు రోజుల నుంచి ఉపవాస దీక్ష చేయడం మీడియాలో సవివరంగా ప్రసారమైంది. ఎ.పి లో లేపాక్షి, తమిళనాడులో రామేశ్వరం సహా దక్షిణాదిలో రామాయణ కథలతో ముడిపడిన ప్రదేశాలను ప్రధాని అధికార హోదాలోనే సందర్శించి వివరాలు విడుదల చేశారు. ఆ విధంగా ఉత్తర దక్షిణ భారతాల మధ్య బిజెపి ఒక మత సేతువును కట్టే వ్యూహాత్మక ప్రయత్నం చేసింది. వీటన్నిటి తర్వాత రిపబ్లిక్ దినోత్సవ పెరేడ్‌లో ఉత్తర ప్రదేశ్ శకటం రామమందిర ఇతివృత్తంతో సాగింది.**

పోస్ట్ పోల్ అవగాహనే...

జాతీయ రాజకీయాలకు వస్తే బిజెపికి వ్యతిరేకంగా ఏర్పడిన 'ఇండియా' వేదిక ఈ వారం అనేక ఒడుదుడుకులు చూసింది. ఎన్నికల తర్వాత మాత్రమే (పోస్ట్ పోల్) అవగాహన సాధ్యమని సీతారాం ఏచూరి వంటి సీనియర్ నాయకులు ముందే చెప్పిన మాటల సత్యం ఎంతో అందరికీ అనుభవంలోకి వస్తున్నది. బెంగాల్ ముఖ్యమంత్రి, టిఎంసి నేత మమతా బెనర్జీ కాంగ్రెస్‌కు తలుపులు మూయడం కూడా సిపిఎం వైఖరి సరైందని నిరూపించింది. ఎందుకంటే టిఎంసితో పొత్తు ప్రసక్తి వుండదని సిపిఎం ఎప్పుడూ చెబుతూనే వచ్చింది. పంజాబ్‌లో ఆప్ కూడా అన్ని సీట్లు తనే పోటీ చేస్తానని ప్రకటించింది. యు.పి లో సమాజ్‌వాది పార్టీకి, కాంగ్రెస్‌కు గతంలోనే కుదిరింది లేకపోగా ఇప్పుడు దూరం పెరిగింది. బిఎస్‌పి మాయావతి ఎటూ ఒంటరిగానే అంటున్న స్థితి. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ రాజకీయ పిల్లిమొగ్గలు వీటన్నిటినీ మించి పోయాయి. అయిదోసారి ఆయన యూ టర్న్ తీసుకుని బిజెపితో కలసి ప్రభుత్వం ఏర్పాటు చేస్తారనే సూచనలు బలంగా వున్నాయి. మహారాష్ట్ర శివసేన కూడా ముక్కలైపోయి ప్రధాన భాగం బిజెపితో కలిసి ప్రయాణిస్తున్నది. ఈ పరిణామాలు లౌకిక శిబిరానికి నష్టం చేసేవి. అయితే దక్షిణాదిన మాత్రం బిజెపి పెరిగే సూచనలు ఆ స్థాయిలో కనిపించడం లేదు. అంత మాత్రాన ఆ మతోన్మాద రాజకీయాల ప్రభావాన్ని ఉపేక్షించడం కూడా పొరబాటే అవుతుంది. తెలుగు నాట ప్రాంతీయ పార్టీలన్నీ బిజెపి పట్ల అనుకూలత పాటిస్తున్న రీత్యా ఇది మరింత అవసరం. కానీ దాన్ని మరో కొసకు తీసుకెళ్లి బిజెపికి తిరుగేలేదు గనక లోబడిపోవడమే మేలని అనేక పాలక పార్టీలూ మీడియా సంస్థలూ వాదించడం అర్థరహితం.

బిజెపికీ సందేహాలు

నిజానికి అయోధ్య లేకుండా తను నెట్టుకు రాలేనని బిజెపి భావించడం, భయపడటం వల్లనే దాన్ని త్వరగా పూర్తి చేసి ప్రారంభించారు. మోడీ గొప్పను చెబుతూనే రాముణ్ని ఎన్నికల సాధనంగా వాడుకోవాలనుకుంటున్నారు. ఇందులో వ్యూహంతో పాటు బలహీనతా కనిపిస్తుంది. బిజెపి ఎంత ఆరాటపడినా దేశంలో చాలా పార్టీలు దాని నాయకత్వంలో జరిగే ఈ ఉత్సవానికి హాజరవడానికి నిరాకరించాయి. ఇది మన మీడియా రాజకీయంగా చూపిస్తుందే గాని సానుకూల కోణాన్ని చెప్పదు. వామపక్షేతర పార్టీలు కూడా రామాలయం మీ స్వంత వ్యవహారం కాదని చెప్పగలిగాయంటే ఈ దేశంలో బలమైన లౌకిక సంప్రదాయాల పునాది తెలుస్తుంది. గుళ్లూ యజ్ఞయాగాదులతో గెలవగలమనుకున్న ప్రాంతీయ పార్టీల నేతలూ దెబ్బతిన్నారు. బిజెపితో అనుకూలంగా వున్నారనే ఆరోపణలకు ఆస్కారమిచ్చిన బిఆర్‌ఎస్ కూడా ఓడిపోయింది. దక్షిణాన ఇతర చోట్ల కన్నా మతాల, మఠాల ప్రభావం ఎక్కువగా వుండే కర్ణాటకలోనూ గెలవలేకపోయింది. గతంలోనూ మొన్న ఎన్నికల్లోనూ గెలిచిన రాష్ట్రాలలో కూడా బిజెపి బలం క్షీణించింది. ఉదాహరణకు మొన్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో బిజెపికి 59, కాంగ్రెస్‌కు 5 స్థానాలుండేవి. మొన్నటి సారి కాంగ్రెస్ ఓడిపోయినా సరే ఆ ఓట్ల లెక్కన చూస్తే బిజెపికి 35, కాంగ్రెస్‌కు 29 రావచ్చని అంచనా. అచ్చగా ప్రాంతీయ పార్టీల మధ్యనే పోటీ జరిగే రాష్ట్రాలలోనూ పరిస్థితి వేరుగా వుంటుంది. ఈ కారణంగానే బిజెపి ఒకటికి పదిసార్లు సమావేశాలు జరుపుతూ సన్నాహాలంటూ హడావుడి చేస్తున్నది. చిన్న చిన్న పార్టీల నుంచి కూడా సీట్లు లేనివారిని కూడా వెంటపడి చేర్చుకుంటున్నది. మొత్తంపైన 2019తో పోలిస్తే బిజెపికి 90 స్థానాల దాకా కొరత రావచ్చని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే చివరగా చెప్పాలంటే బిజెపి మతోన్మాద రాజకీయాలను గట్టిగా ఎదుర్కొని నిలవరించాలనడంలో సందేహం లేదు. కానీ దాని విజయమేదో ఖాయమైనట్టు ఎవరైనా తలవంచక తప్పదన్నట్టు టిడిపి, వైసిపి వంటి పార్టీలు కాని మీడియా సంస్థలు, వ్యక్తులు గాని చెబితే తప్పక తోసిపుచ్చాలి. లౌకికతత్వం కోసం, మత సామరస్యం కోసం విస్తారమైన కృషిని నిరంతరాయంగా కొనసాగించాలి. ★

> **నిజానికి అయోధ్య లేకుండా తను నెట్టుకు రాలేనని బిజెపి భావించడం, భయపడటం వల్లనే దాన్ని త్వరగా పూర్తి చేసి ప్రారంభించారు. మోడీ గొప్పను చెబుతూనే రాముణ్ని ఎన్నికల సాధనంగా వాడుకోవాలనుకుంటున్నారు. ఇందులో వ్యూహంతో పాటు బలహీనతా కనిపిస్తుంది. బిజెపి ఎంత ఆరాటపడినా దేశంలో చాలా పార్టీలు దాని నాయకత్వంలో జరిగే ఈ ఉత్సవానికి హాజరవడానికి నిరాకరించాయి. ఇది మన మీడియా రాజకీయంగా చూపిస్తుందే గాని సానుకూల కోణాన్ని చెప్పదు. వామపక్షేతర పార్టీలు కూడా రామాలయం మీ స్వంత వ్యవహారం కాదని చెప్పగలిగాయంటే ఈ దేశంలో బలమైన లౌకిక సంప్రదాయాల పునాది తెలుస్తుంది.**

అభిప్రాయం

సైన్స్ మాసోత్సవం

వివిధ దినోత్సవాల సందర్భంగా ఆయా ప్రభుత్వాలు వారోత్సవాలు, పక్షోత్సవాలు నిర్వహిస్తుంటాయి. ఇందులో భాగంగా ప్రజలలో చైతన్యం పెంచడానికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇక మత సంబంధిత కార్యక్రమాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వీటి గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తారు. సాధారణంగా ప్రజల్లో కూడా మత క్రతువుల పట్ల ఆసక్తి వుంటుంది. అయితే మన దేశంలో వివిధ పండుగలకు ఇచ్చిన ప్రాధాన్యత సైన్స్ విషయాలకు ఇవ్వడం లేదు. ప్రజలలో రోజురోజుకు మూఢనమ్మకాలు పెరుగుతున్నాయి.

ప్రతి ఏటా దేశంలో ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుతారు. కేవలం ఆ ఒక్క రోజు మాత్రమే సైన్స్ పరిశోధనలు గురించి మాట్లాడుకుంటే సరిపోదు. ఫిబ్రవరి నెలను సైన్స్ మాసోత్సవంగా ప్రభుత్వాలు అధికారికంగా ప్రకటించాలి. నెలంతా దేశ వ్యాప్తంగా సైన్స్ అవగాహన కార్యక్రమాలు చేయాలి. విశ్వవిద్యాలయాలలో సైన్స్ సెమినార్లు నిర్వహించాలి. సైన్స్ అభివృద్ధికి కృషి చేసిన మహనీయులను నేటి తరానికి పరిచయం చేయాలి. ఇటీవల ఐ.ఐ.ఐ.టి, హైదరాబాద్ ఆస్క్-ఆర్ సి టి ఎస్ అనే యాప్‌ను సైన్స్ సందేహాల నివృత్తికి రూపకల్పన చేసింది. ఎటువంటి నెట్ సదుపాయం లేకుండానే ఒక్క ఫోన్ కాల్‌తో విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ఇటువంటి అంశాలను విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది.

ఒకప్పుడు దేశంలో విశ్వవిద్యాలయాలు గొప్ప పరిశోధనా కేంద్రాలుగా విరాజిల్లాయి. ఇప్పుడు సరైన బోధనా సిబ్బంది లేక వాటి ప్రాముఖ్యతను క్రమంగా కోల్పోతున్నాయి. సైన్స్ దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా సైన్స్ అవగాహన కార్యక్రమాలు చేయాలి. సైన్స్ విషయాలను ప్రచారం చేసే జన విజ్ఞాన వేదిక వంటి సంస్థలను ప్రోత్సహించాలి.అదే విధంగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల మాదిరిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మూఢ నమ్మకాల నియంత్రణ చట్టాలను తీసుకురావాలి. సైన్స్ పరిశోధన చేసే విద్యార్థులకు రాయితీలు, ప్రోత్సాహకాలు అందించాలి. వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా సైన్స్ పరిశోధనల గురించి ప్రత్యేకంగా ప్రచారం చేయాలి. అప్పుడే దేశంలో సైన్స్ ఆవిష్కరణలకు అవకాశం ఏర్పడుతుంది.

- యం.రాం ప్రదీప్,
జన విజ్ఞాన వేదిక ప్రతినిధి, తిరువూరు. సెల్: 9492712836

సెటైర్

'మరేటంతారు బాబూ...?'

"జన్మ ధన్యం అయిపోయిందనుకో! ఆ బాలరాముడి విగ్రహం దర్శించుకోవడం నిజంగా నా అదృష్టం. ఇహ అక్కడ ఏర్పాట్లూ, ఆ జన సందోహం-ఏమైనా అతగాడు కారణ జన్ముడయ్యా!" అంటూ పరవశించిపోతున్నాడు అప్పలాచారి.

అతగాడిది అయోధ్య పర్యటనను తలుచుకుని వచ్చిన పారవశ్యమో లేక మా ఆవిడ ఫ్రెష్‌గా వేసిన ఫిల్టర్ నుండి దిగిన డికాషన్‌తో కలిపిన కాఫీ తాగినందువలన కలిగిన పారవశ్యమో నేను తేల్చుకోలేకపోతున్నాను.

"అక్కడికి వెళ్ళలేకపోయామే అన్న దిగులు తప్ప మేం కూడా ఇక్కడ నుంచే టీవీల్లో అంతా చూస్తూనే వున్నాం అన్నగారూ! అంతా మోడీ గారి చలవే అనుకోండి" అంటూ తోడైంది నా సతీమణి.

ఆ పక్కనే ఇస్త్రీకి తీసుకెళ్ళిన బట్టల లెక్కకి, తెచ్చిన బట్టల లెక్కకి సరి చూస్తున్నాడు మా అబ్బాయి. బట్టలు తెచ్చిన అప్పారావు అప్పలాచారి చెప్పినది తలాడిస్తూ వింటున్నాడు. తాను చెప్పేదాన్ని తలాడిస్తూ వినే శ్రోత దొరికితే అప్పలాచారి రెచ్చిపోతాడు. అందుకే నేను భయపడుతున్నాను. ఇంతలో

"బాబూ! అయితేటి? తవురు అంతదూరం రాముడిని సూడ్డానికా ఎల్లారు ? మనూరి కోవెల్లో ఉన్నోరు రాముడు కాదంతారేటి ఐతే ?" అంటూ అప్పారావు సందేహం వెలిబుచ్చాడు.

"ఓరి వెర్రివాడా ! అయోధ్యలో ఐదు వందల సంవత్సరాల తర్వాత మళ్ళా రాముడు తిరిగొచ్చాడోయ్ ! మరి వెళ్ళొద్దా?" అన్నాడు ఆచారి.

"బాబూ! నాను మీలా సదూకున్నోడిని కాదు. అంచాత ఎర్రి మొర్రి పెశ్నలే నాకు వత్తాయి. తవురు మరోలాగ అనుకోకండా మా అగ్గేనాన్ని మన్నించాల మరి.

ఏటంతారు? అంచాత నా డౌటేటంటే మరి ఈ ఐదొందల ఏళ్ళూ ఆ రాముడు ఎక్కడికి పోనాడు? ఎందుకు పోనాడు? మనూర్లో ఎలిసిన రాములోరు, తమరు అంత దూరం ఎల్లి సూసొచ్చిన రాములోరు ఒక్కరేనా ? కాదా? మనూర్లో మొక్కితే రాములోరు నా మొక్కు తీర్సడా? ఆయనగోరు నా మొక్కు తీర్సాలంటే నాను అయోధ్య దాకా ఎల్లి రావలసిందేనా? ఏటి? ఏటంతారు ?" అని చాలా వినయంగా, భక్తి పూర్వకంగా, పరవశంతో అడిగాడు అప్పారావు (ఫిల్టర్ కాఫీ తాగకపోయినా కూడా).

అప్పలాచారి అప్పారావు సందేహాలను తీర్చడానికి ఉపక్రమించేడు. " అసలు ఐదు వందల ఏళ్ళ క్రితం రాములవారి ఆలయాన్ని ఒక దుర్మార్గుడు, పరాయి మతస్తుడు ..."

అంటూ ఆరంభించగానే నాకర్థమైపోయింది. అప్పలాచారిని అప్పుడు గనక ఆపకపోతే అతగాడు భోజనాలదాకా మా ఇంట్లోనే సెటిలైపోతాడు. అందుచేత "ఇదిగో అప్పారావ్ ! నీకు వేరే ఇళ్ళల్లో ఇవ్వవలసిన ఇస్త్రీ బట్టలు లేవా ఏమిటి?" అని గుర్తు చేశాను.

"అయ్ బాబోయ్ ! నేకపోవడమేటి బాబూ ! శానా ఉన్నాయి. కాపోతే ఆచారిగారి లాంటి గొప్పోరు ఎదుట బడితే మరి డౌట్లు అలా వొరసపెట్టి తరుముకుంటూ ఒచ్చేస్తాయి గదా ! నాకైతే ఇప్పుడెల్తాగానీ ఆచారిగోరూ ! నాకు ఇంకా మరికొన్ని డౌట్లు ఉన్నాయండీ, సెప్పుకోమంటారా? ఇప్పుడు సెప్పేస్తాను. ఆనక తవరు మళ్లీ ఒచ్చినప్పుడు కనిపెట్టుకుని ఉండి గబుక్కున వొచ్చేస్తాను. అప్పుడు ఈ డౌట్లన్నీ తీరిసీయాల తవరు. ఏటంతారు ?" అన్నాడు.

భక్తుడికి వరం ఇచ్చిన భగవంతుడి పోజు పెట్టి అప్పలాచారి "అడుక్కో నీ డౌట్లు" అన్నాడు.

"మరేమోనండీ, అల్లప్పుడెప్పుడో త్రేతాయుగం నాడు రాములోరు లవకుశులకి రాజ్యం వొప్పజెప్పి సరయూ నదిలో దిగి అవతారం సాలించీసినారని కోవెల్లో పూజారిగారు సెప్పినారు. అంతే గాదండోయ్! రాములోరు ఇష్ణువు అవతారం అని సెప్పినారు. ఇష్ణువు ఒకోకసారి ఒక్కో అవతారంలో బూమ్మీదకొచ్చి పాపాలు సేసినోల్లందరినీ సిచ్చించి మళ్ళీ ఎలిపోతారని కూడా సెప్పినారు. ఒకపాలి వొచ్చిన అవతారంలో మళ్ళీ రారని, ఈమారు గనక వొత్తే కలికి అవుతారంలో గుఱ్ఱం ఎక్కి కత్తొట్టుకుని వొచ్చి కసా బిసా పాపుల్ని ఏసేస్తారని కూడా సెప్పారండీ. మరి మా పూజారిగోరు సెప్పింది కరెట్టే అయితే ఇప్పుడు రాముడు మళ్ళీ రావడం అంతారేటండీ ? పూజారిగోరు తప్పా? తమరు సెప్పింది తప్పా? తెలక అడిగినాను బాబూ, మరేటనుకోకండి."

అప్పలాచారి ఏం చెప్పాలో తేల్చుకోకమునుపే ...

"బాబూ ! ఇంకో డౌటండి. మనూర్లో బూవుల్ని కబ్జా సేయిస్సి రీలెట్టేట్లో (అనగా రియల్ ఎస్టేట్ లో అని చదువరులు గమనించ ప్రార్థన) కోట్ల లెక్కన అమ్మీసిన పాపాల బైరవుడు యీరయ్యగోరు అయోధ్యలో గుడి కట్టడానికి ఏబై కోట్లంపినాడంట. పత్రికల్లో కూడా ఆ యిసయం అచ్చేసేరు. తవరు సూసివుంటార్లెండి. ఇంతకీ ఆ ఏబై కోట్లూ కర్సెట్టి గుడి కడితే అక్కడ రాములోరు ఉండడానికి ఒప్పుకుంతారా బాబూ ?"

"ఆగండాగండి బాబూ ! ఇంకొక్క డౌటుంది మరి. ఈ మద్దెన డిల్లీలో పార్లమెంటుకి కొత్త బిల్డింగు శానా గొప్పగా కట్టినారంట కదండీ బావూః మరా బిల్డింగుని వోపెనింగు సేయించడానికి మన దేశానికే పెద్ద దిక్కు, మన రాష్ట్రపతిగోరు, ఆ యమ్మగోరి .." అని పేరు కోసం అప్పారావు తడుముకుంటూంటే మా అబ్బాయి "ద్రౌపది ముర్ము" అని అందించాడు.

"మా బాబే !" అని మురిపెంగా మా వాడిని మెచ్చుకుని అప్పారావు కొనసాగించేడు. "అదేనండి , ఆ యమ్మగోరిని పిలవలేదెందుకని అడిగితే ఆ యమ్మ బరత ఇప్పుడు లేరు గదా. యితంతువులు పేరంబించకూడదు కదా అని ఊళ్లో తమబోటి పెద్దలు సెప్పేరండి మరి. అటువంటప్పుడు రాములోరి గుడిని మోడీగోరు పేరంబించడం ఏటని అదేదో పేద్ద మటం పెద్దగోరు..(పూరీ శంకరాచార్య అని మళ్ళీ మావాడు అందించేడు) అడిగినారట గదా. మరి ఆ మటం పెద్ద రైటా ? మోడీ గోరిసేత గుడిని పేరంబం సేయించిన పెద్దలు రైటా? నాకైతే ఏటీ బోదపడకండా ఉన్నాది.

"రాములోరంటే నాకు శేనా ఇష్టం. ఆయనగోరికి దేశం నిండా ఎక్కడ బడితే అక్కడ గుళ్ళు ఉన్నాయి. మరి బద్రాశెలంలో గుడి కట్టినదానికి అయిన కరుసంతా ఆ రాములోరే సొయంగా తెచ్చి ఆ తానీషాకి దరిశెనం ఇచ్చి మరీ సెల్లుబాటు సేసేరు. అంత లెక్కైన దేవుడు మరి అలాంటి రాములోరికి మళ్ళీ ఇప్పుడు ఇంకో గుడి కట్టడం ఏంటో, అందుకోసం శేనామంది తాలూకు నెత్తురు పారడం ఏంటో, అరదం కావడం లేదు బాబూ."

"మాబోటోల్లు తిండికి లేకుండా ఇబ్బందులు పడుతూంటే ఆ సంగతి వొదిలేసి కోట్లకి కోట్లు కరుసెట్టి లచ్చ గుడులున్న తనకి మళ్లీ ఇంకో గుడి కట్టమని గాని రాములోరు ఎవురికైనా సెప్పినాడా ? ఏటి అవుతోందో ఏటీ బోద పడడం లేదు బాబూ."

"ఈ పాలొచ్చినప్పుడు ఈ డౌట్లన్నీ తవఁరే నాకు సక్కగా యిప్పి సెప్పాల మరి. దయుంచండి బాబూ! నాను గాని తప్పు మాట గాని మాట్లాడితే నన్నొగ్గకండి బాబూ! ఏటి తప్పు మాట ఆడినానో సెప్పి మరీ సిచ్చించండి బాబూ! శెలవిప్పించండి మరి" అంటూ గుమ్మం దిగాడు అప్పారావు.

మరి ఏవైందో ఏమో గాని...ఆ తర్వాత ఇంతవరకూ అప్పలాచారి మా ఇంటికి రాలేదు. ఆఫీసులోనే పలకరిస్తున్నాడు. మా ఆవిడ ఇచ్చే ఫిల్టర్ కాఫీ పారవశ్యం ఇప్పుడు పూర్తిగా నా ఒక్కడిదే.

- సుబ్రమణ్యం

జార్ఖండ్ సిఎంకు మళ్లీ సమన్లు

రాంచి : భూ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) తాజాగా సమన్లు జారీ చేసింది. వచ్చే వారం జరగనున్న విచారణకు మళ్లీ హాజరు కావాల్సిందిగా కోరినట్లు అధికార వర్గాలు శనివారం తెలిపాయి. జనవరి 29 లేదా 31 ఈ రెండు తేదీల్లో ఏ రోజు అందుబాటులో వుంటారో కూడా ధృవీకరించాల్సిందిగా సోరెన్‌ను కోరింది. 27నుండి 31 వరకు ఏ తేదీనైనా విచారణకు రావచ్చని అంతకుముందు సోరెన్‌ను కోరారు. అయితే అటువైపు నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో తాజాగా సమన్లు జారీ చేశారు. ఈ కేసులో మొదటిసారిగా జనవరి 20న సోరెన్ స్టేట్‌మెంట్‌ను ఇడి నమోదు చేసింది. రాంచిలోని ముఖ్యమంత్రి అధికార నివాసంలో దాదాపు ఏడు గంటల పాటు దర్యాప్తు అధికారులు సోరెన్‌ను విచారించారు. అయితే ఆ రోజు విచారణ పూర్తి కానందున మళ్లీ పిలిచినట్లు తెలుస్తోంది. జార్ఖండ్‌లో భూముల యాజమాన్య హక్కులపై మాఫియా రాకెట్‌కు సంబంధించి ఈ దర్యాప్తు జరుగుతోంది. ఈ కేసులో ఇప్పటివరకు ఇడి 14మందిని అరెస్టు చేసింది.

రబ్రీ దేవి, ఆమె కుమార్తెలకు ఢిల్లీ కోర్టు సమన్లు

న్యూఢిల్లీ : మనీ లాండరింగ్‌తో ముడిపడిన ఉద్యోగాల కోసం భూమి కేసులో ఇడి చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్న ఢిల్లీ కోర్టు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి రబ్రీ దేవి, ఆమె కుమార్తెలు మీశా భారతి, హేమా యాదవ్‌లతో పాటూ మరికొంతమందిని విచారణకు హాజరు కావాల్సిందిగా సమన్లు జారీ చేసింది. ఈ కేసులో ముందుకు సాగడానికి అవసరమైన సాక్ష్యాధారాలు వున్నాయంటూ ఫిబ్రవరి 9న తమ ముందుకు హాజరు కావాలని ప్రత్యేక న్యాయమూర్తి విశాల్, నిందితులను ఆదేశించారు. ఈ కేసులో జ్యుడీషియల్ కస్టడీలో వున్న వ్యాపారవేత్త అమిత్ కత్యాల్‌కు కూడా వారంటు జారీ చేశారు. యాదవ్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన కత్యాల్‌తో పాటూ రైల్వే ఉద్యోగి, లబ్దిదారుడు హృదయానంద్ చౌదరి, షారిఖ్ బరిల పేర్లు కూడా ఈ ఛార్జిషీట్‌లో వున్నాయి. గతేడాది నవంబరులో కత్యాల్‌ను ఇడి అరెస్టు చేసింది. బీహార్ మాజీ సిఎం లాలూ ప్రసాద్ యాదవ్‌కు కూడా సమన్లు జారీ అయినా ఆయన ఇంకా సాక్ష్యమివ్వాల్సి వుంది. ఇప్పటికే ఒకసారి సాక్ష్యమిచ్చిన డిప్యూటీ సిఎం తేజస్వి యాదవ్‌ను మరోసారి రావాల్సిందిగా ఇడి కోరింది. ఈ కేసులో ఇడి అనుబంధ చార్జిషీట్ దాఖలు చేస్తుందని భావిస్తున్నారు.

యుసిసి బిల్లు కోసం 5న అసెంబ్లీ ప్రత్యేక భేటీ

- ఉత్తరాఖండ్ ప్రభుత్వం నిర్ణయం

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్ శాసనసభ ప్రత్యేక సమావేశాలు ఫిబ్రవరి ఐదవ తేదీ నుండి ప్రారంభమవుతాయి. ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి) బిల్లును ఆమోదించేందుకే బిజెపి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఈ సమావేశాలను ఏర్పాటు చేస్తోందని ప్రభుత్వ అధికారులు తెలిపారు. అయితే సమావేశాల అజెండాను ప్రభుత్వం ఇప్పటి వరకూ విడుదల చేయలేదు. సమావేశాల ప్రారంభానికి ముందు జరిగే శాసనసభ వ్యవహారాల సలహా సంఘం సమావేశంలో అజెండాను ఖరారు చేస్తారని సమాచారం. ఇదిలావుండగా యుసిసి అమలుపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రంజన ప్రకాష్ దేశాయ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల కమిటీ వచ్చే నెల 2న పుష్కర్ సింగ్ ధామీ ప్రభుత్వానికి పూర్తి నివేదికను సమర్పించే అవకాశం ఉంది. కమిటీ పదవీకాలం ఈ నెల 26నే ముగిసినప్పటికీ దానిని రెండు వారాలు పొడిగించారు.

యుసిసిని అమలు చేయబోతున్నామని రిపబ్లిక్ దినోత్సవ ప్రసంగంలో ముఖ్యమంత్రి ధామీ సూచనప్రాయంగా తెలిపారు. రాష్ట్రంలో యుసిసి చట్టాన్ని అమలు చేస్తామని 2022 ఎన్నికల సమయంలో బిజెపి హామీ ఇచ్చింది. యుసిసి అమలు, అయోధ్యలో రామ మందిర నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు అనే అంశాలు ఎప్పటి నుండో బిజెపి ఎన్నికల ప్రణాళికలో ఉన్నాయి. వీటిలో యుసిసి అమలు మినహా మిగిలిన రెండూ ఇప్పటికే వాస్తవ రూపం దాల్చాయి. యుసిసి అమలులో సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు రాష్ట్రాలు కమిటీలను ఏర్పాటు చేసుకోవచ్చునని గత సంవత్సరం జనవరిలో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

అడెన్ జలసంధిలో ప్రమాదంలో వాణిజ్య నౌక

- రంగంలోకి దిగిన ఐఎన్ఎస్ విశాఖపట్నం

న్యూఢిల్లీ : ఆపదలో వున్నామంటూ అడెన్ జలసంధిలో శుక్రవారం ఒక వాణిజ్య నౌక నుండి వచ్చిన సందేశం నేపథ్యంలో భారత నావికాదళం సత్వరమే ప్రతిస్పందించింది. గైడెడ్-మిస్సైల్ డిస్ట్రాయర్ ఐఎన్ఎస్ విశాఖపట్నంను రంగంలోకి దింపింది. మార్షల్ ఐలాండ్స్ జెండాతో వున్న మార్లిన్ లాండా నౌకపై హౌతి రెబెల్స్ నౌకా విధ్వంసక క్షిపణులతో దాడి చేశారు. దాంతో వెంటనే నౌకలో మంటలు చెలరేగాయి. కొంత ధ్వంసమైనట్లు కూడా తెలుస్తోంది. అయితే ఎవరూ మరణించినట్లు లేదా గాయపడినట్లు వార్తలందలేదని భారత నావికాదళం ఎక్స్‌లో పోస్టు చేసింది. ఆ సమయంలో నౌకలో 22మంది భారతీయులు, బంగ్లాదేశ్ సిబ్బంది వున్నారని, మంటలను అదుపు చేయడానికి నిపుణుల బృందం పనిచేస్తోందని తెలిపింది.

గత వారమే జెన్‌కో పికార్డి నౌక కూడా ఇలాగే దాడులకు గురవగా, భారత నావికదళమే స్పందించి కాపాడింది.

బిజెపిలోకి వస్తే పాతిక కోట్లు

- ఏడుగురు ఆప్ ఎమ్మెల్యేలతో బేరసారాలు
- ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సంచలన ఆరోపణ

న్యూఢిల్లీ : పార్టీ ఫిరాయిసే ఆమాద్మీకి చెందిన ఏడుగురు ఢిల్లీ ఎమ్మెల్యేలకు పాతిక కోట్ల రూపాయలు ఇస్తామని బిజెపి ప్రలోభపెట్టిందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణ చేశారు. ఈ మేరకు తమ పార్టీ ఎమ్మెల్యేలతో బిజెపి బేరసారాలు నడిపిందని, మద్యం పాలసీ కుంభకోణంలో తనను అరెస్ట్ చేస్తానని కూడా బెదిరించిందని ఆయన చెప్పారు. బిజెపి ఎమ్మెల్యేలు జరిపిన సంభాషణలను రికార్డు చేశామని ఆప్ తెలిపింది. 'ఇటీవల ఢిల్లీకి చెందిన ఏడుగురు ఆప్ శాసనసభ్యులను బిజెపి సంప్రదించింది. కొద్ది రోజుల్లో కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేస్తామని, ఆ తర్వాత ఎమ్మెల్యేలను తమ వైపు తిప్పుకుంటామని చెప్పింది. 21 మంది శాసనసభ్యులతో చర్చలు జరిపామని, మిగిలిన వారిని కూడా సంప్రదిస్తున్నామని తెలిపింది. ఆ పని పూర్తయిన తర్వాత ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ ప్రభుత్వాన్ని పడగొడతామని అన్నారు. మీరు కూడా రావచ్చని మా ఏడుగురు ఎమ్మెల్యేలకు ఆఫర్ ఇచ్చారు. పార్టీ మారితే పాతిక కోట్లు ఇస్తామని, రాబోయే ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులుగా పోటీ చేసేందుకు టిక్కెట్లు కూడా ఇస్తామని ఆశ పెట్టారు' అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో కేజ్రీవాల్ శనివారం పోస్ట్ చేశారు. ఇప్పటి వరకూ 21 మంది ఎమ్మెల్యేలను సంప్రదించామని బిజెపి చెబుతున్నప్పటికీ ఏడుగురితో మాత్రమే చర్చించిందని తమ వద్ద సమాచారం ఉన్నదని

మీడియాతో మాట్లాడుతున్న కేజ్రీవాల్

కేజ్రీవాల్ తెలిపారు. బిజెపి ఇచ్చిన ఆఫర్‌ను వీరందరూ తిరస్కరించారని చెప్పారు. ఎన్నికల్లో ఆప్‌ను ఓడించే సత్తా లేకపోవడంతో దొడ్డిదారిన ప్రభుత్వాన్ని కూల్చేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. 'దీనర్థం ఏమిటంటే మద్యం కుంభకోణంపై విచారణ కోసం నన్ను అరెస్ట్ చేయడం లేదు. కానీ వారు ఢిల్లీలోని ఆమ్‌ఆద్మీ పార్టీని కూలదోసేందుకు కుట్ర చేస్తున్నారు. గత తొమ్మిది సంవత్సరాల్లో వారు మా ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు అనేక కుట్రలు పన్నారు. అయితే వారు విజయం సాధించలేకపోయారు. దేవుడు, ప్రజలు మాకు ఎల్లవేళలా మద్దతు ఇస్తూనే ఉన్నారు. మా ఎమ్మెల్యేలందరూ కలసికట్టుగా ఉన్నారు. ఈ సారి కూడా వారు తమ నీచమైన ప్రయత్నాల్లో విఫలమవుతారు' అని కేజ్రీవాల్ అన్నారు.

ఢిల్లీ ప్రజల కోసం తమ ప్రభుత్వం ఎన్ని పనులు చేసిందో బిజెపికి తెలుసునని, వారు ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినప్పటికీ వాటిని ఎదుర్కొని నిలబడ్డామని కేజ్రీవాల్ చెప్పారు. ఢిల్లీ ప్రజలు ఆప్‌ను అపారంగా ప్రేమిస్తారని, కాబట్టి ఎన్నికల్లో ఆప్‌ను ఓడించే సత్తా వారికి లేదని తెలిపారు. అందుకే మద్యం కుంభకోణం పేరు చెప్పి తనను అరెస్ట్ చేయడం ద్వారా ప్రభుత్వాన్ని పడగొట్టాలని భావిస్తున్నారని విమర్శించారు.

రాజధానిలో రాజకీయ అశాంతిని సృష్టించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని రాష్ట్ర మంత్రి అతిష్ ఆరోపించారు. 'కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేస్తామని, 21 మంది ఎమ్మెల్యేలను లోబరచుకుంటామని, ప్రభుత్వాన్ని కూలదోస్తామని వీడియో టేపులో వారు చెప్పారు. తమకు ఇవ్వజూపిన సొమ్మును ఆప్ ఎమ్మెల్యేలందరూ తిరస్కరించారు. ప్రభుత్వాలను పడగొట్టడం బిజెపికి అలవాటే. మధ్యప్రదేశ్, కర్నాటక, అరుణాచల్‌లో వారు చేసింది అదే పని' అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గెలవలేని చోట ప్రజా ప్రభుత్వాలను కూలదోసేందుకు బిజెపి ప్రయత్నిస్తూ ఉంటుందని ఎద్దేవా చేశారు.

నితీష్ కుప్పిగంతులు

పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి, జెడి(యు) నాయకుడు నితీష్ కుమార్ 2000 మార్చి 3న మొదటిసారి బీహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 2000-2022 మధ్య ఆయన ఎనిమిది సార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. చివరిసారి 2022లో ఆర్జెడి, కాంగ్రెస్‌తో కూడిన మహాఘట బంధన్ తరపున ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. రాజకీయాల్లో పరిస్థితులను బట్టి రంగులు మార్చడంలో నితీష్ రికార్డు సృష్టించారు. అందుకే ఆయనను లలూ ప్రసాద్ యావవ్ పల్తు కుమార్ అని పిలుస్తారు. నితీష్ కుమార్ 1996లో జార్జి ఫెర్నాండెజ్‌తో కలసి సమతా పార్టీని ఏర్పాటుచేశారు. ఆ తరువాత ఎన్డీయే కూటమిలో చేరి వాజ్‌పేయి ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. శరద్ యాదవ్‌తో విభేదించి లలూ ప్రసాద్ యాదవ్ 2003లో రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జెడి) పార్టీని ఏర్పాటు చేశాక, నితీష్ సమతా పార్టీని శరద్ యాదవ్ నేతృత్వంలోని జనతాదళ్‌లో విలీనం చేశారు. దానికి జెడి(యు) అని పేరు పెట్టారు. 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రధాని పదవికి ఎన్డీయే అభ్యర్థిగా మోడీ నామినేట్ కావడంతో నితీస్ ఆ కూటమి నుంచి బయటకు వచ్చారు. 2015 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జెడీ, కాంగ్రెస్‌తో కలసి మహా ఘటబంధన్ తరపున పోటీ చేసి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. 2017లో మహాఘట బంధన్ నుంచి బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే శిబిరంలోకి ఫిరాయించారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపితో చేతులు కలిపారు. ఆ ఎన్నికల్లో జెడి(యు) పరిస్థితి దయనీయంగా తయారైంది. దీంతో ముఖ్యమంత్రి పదవి నితీష్‌కు ఇచ్చినా బిజెపి ఆయనకు ప్రాధాన్యతను తగ్గించింది. తనకు వ్యతిరేకంగా తమ పార్టీ ఎమ్మెల్యేలతో తిరుగుబాటు చేయించేందుకు బిజెపి కుట్ర పన్నుతోందంటూ 2022లో ఎన్డీయేను వీడి ఆర్జెడి, కాంగ్రెస్‌తో కలసి ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఇప్పుడు మళ్లీ బిజెపి వైపు చూస్తున్నారు.

వేధింపుల కేసులో భారత అమెరికన్ జంటకు 20 ఏళ్ల శిక్ష!

- దోషులుగా నిర్ధారించిన వర్జీనియా కోర్టు
- మే 8న శిక్ష ఖరారు

న్యూయార్క్ : అమెరికాలోని వర్జీనియా ఫెడరల్ జ్యూరీ రెండు వారాల విచారణ అనంతరం ఒక భారతీయ అమెరికన్ జంటను దోషులుగా నిర్ధారించింది. ఈ దంపతులు తమ బంధువును వేధించారని స్పష్టమైన నేపథ్యంలో జ్యూరీ వారిని దోషులుగా తేల్చిచెప్పింది. ఆ భారతీయ అమెరికన్ జంట తమ గ్యాస్ స్టేషన్, కన్వీనియన్స్ స్టోర్‌లో తమ బంధువును కార్మికునిగా నియమించుకునేందుకు బలవంతంగా ప్రయత్నించిందని ఫెడరల్ జ్యూరీ నిర్ధారించింది. ఈ కేసులో హర్మన్‌ప్రీత్ సింగ్ (30), కుల్బీర్ కౌర్(43)లు దోషులుగా తేలడంతో వారికి 2024, మే 8న శిక్ష ఖరారు చేయనున్నారు. హర్మన్‌ప్రీత్ సింగ్, కుల్బీర్ కౌర్ దంపతులు తమ బంధువు చేత ఆహారాన్ని వండించడం, క్యాషియర్‌గా పని చేయించడం, స్టోర్ రికార్డులను శుభ్రపరచడం, నిర్వహించడం తదితర పనులు బలవంతంగా చేయించారు. ఇటువంటి కేసులలో గరిష్టంగా 20 సంవత్సరాల జైలు శిక్ష విధించేందుకు అవకాశం ఉంది. అలాగే 2,50,000 అమెరికన్ డాలర్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జస్టిస్ డిపార్ట్‌మెంట్, పౌర హక్కుల విభాగానికి చెందిన అసిస్టెంట్ అటార్నీ జనరల్ క్రిస్టెన్ క్లార్క్ మాట్లాడుతూ ఈ దంపతులు.. యునైటెడ్ స్టేట్స్‌లో పాఠశాలకు వెళ్లాలనే బాధితుని ఆశను అణగార్చారని, శారీరక, మానసిక వేధింపులకు గురి చేశారని అన్నారు. బాధితుని ఇమ్మిగ్రేషన్ పత్రాలను దాచేయడం, తీవ్రమైన హాని కలిగించే ఇతర బెదిరింపులకు గురిచేయడం, కనీస వేతనం కూడా చెల్లించకపోవడం, అధికంగా పనిచేయించడం లాంటి దుశ్చర్యలకు పాల్పడ్డారని అసిస్టెంట్ అటార్నీ జనరల్ పేర్కొన్నారు.

ఇంటి సమీపంలోనే ఉద్యోగం

- పురపాలక సంస్థల పరిధిలో ఉద్యోగ మేళాలు
- ఉపాధి అవకాశాల సృష్టిలో ప్రత్యేకత చాటుతున్న క్యూబా

శాంటా క్లారా : ప్రజల ఆదాయాలను పెంచడమే లక్ష్యంగా అనేక ప్రగతిశీల చర్యలతో ముందడుగు వేస్తున్న క్యూబా ఉపాధి రంగంలోనే ప్రత్యేకత చాటుకుంటోంది. ఇంటికి సమీపంలోనే ఉపాధి అవకాశాలు సృష్టిస్తూ ప్రత్యేక జాబ్ మేళాలు నిర్వహిస్తోంది. జాతీయాభివృద్ధి ప్రణాళిక-2030కు అనుగుణంగా వుండేలా, లేబర్ మార్కెట్‌లో ఒత్తిడిని తగ్గించడానికి, నాణ్యత గల ఉద్యోగాలు అందుబాటులోకి రావడాన్ని పెంపొందించేందుకు దేశవ్యాప్తంగా తీసుకుంటున్న కార్యాచరణలో భాగంగా ప్రతి నెలా మూడో శుక్రవారం ఈ ఉద్యోగాల మేళా నిర్వహిస్తోంది. పైగా ఇవన్నీ కూడా ఇంట్లో నుండే చేసే, ఇంటికి దగ్గర్లోనే చేసే ఉద్యోగాలే కావడం విశేషం. శుక్రవారం ఇలాంటి మేళా నిర్వహించగా విల్లా క్లారా ప్రావిన్స్‌లో 800 మందికి పైగా ఉద్యోగాలు పొందారు. వీరిలో ఎక్కువమంది యువకులు, మహిళలే. దాదాపు అన్ని పురపాలక సంస్థల పరిధిల్లోనూ ఈ మేళాలు

శాంటాక్లారాలో ఉద్యోగ మేళా

నిర్వహిస్తున్నారు. కార్మిక, సామాజిక భద్రత విభాగ డిప్యూటీ డైరెక్టర్ యామిలె లోపెజ్ యాన్స్ మాట్లాడుతూ, తమకు, తమ కుటుంబాలకు మద్దతుగా తగిన ఉపాధి అవకాశం లేని వారికి ఈ మేళాలు మంచి అవకాశాలను కల్పిస్తున్నాయన్నారు. పైగా ఈ ఉద్యోగాలన్నీ కూడా వారి నివాస ప్రాంతాలకు దగ్గర్లోనే వుండడంతో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాల ప్రతిపాదనలకు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందన్నారు. కొత్త ఉద్యోగాలు చేపట్టిన 420 మందిలో 237 మంది యువకులు కాగా, 166 మంది మహిళలని చెప్పారు. పైగా వివిధ సంస్థలు ఇచ్చే శిక్షణా కోర్సుల్లో చేరేందుకు కూడా అనేకమంది ఆసక్తి కనబరిచి దరఖాస్తు చేస్తున్నారని చెప్పారు. చుట్టలు చుట్టడం, సెక్యూరిటీ ఏజెంట్లు, నిర్మాణ కార్మికులు ఇలా అనేక రంగాల్లో అవసరమైన నైపుణ్యాలు పొందడానికి ఈ శిక్షణలు ఉపయోగపడుతున్నాయి.

క్యూబా వైద్య సంస్థకు అంతర్జాతీయ సర్టిఫికెట్

లాటిన్ అమెరికన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ (ఇఎల్ఎఎం) క్యూబాలో అంతర్జాతీయ సర్టిఫికెట్ పొందిన మొదటి వైద్య సంస్థగా పేరొందింది. విప్లవ నేత ఫైడల్ కాస్ట్రో 1999 నవంబరు 15న ప్రారంభించిన ఈ సంస్థకు అత్యంత క్లిష్టమైన నాణ్యతా ప్రామాణికాలను పాటించినందుకు ఈ గౌరవం దక్కింది. ఇది ఆరేళ్ళపాటు అమల్లో వుంటుంది. 25ఏళ్ళపాటు ఈ సంస్థ సాగించిన ప్రయాణంలో 120కి పైగా దేశాలను చేరిందని, 60దేశాల అధినేతలు సందర్శించారని, ముగ్గురు నోబెల్ బహుమతి గ్రహీతలు వున్నారని, 80,100 మంది విదేశీయులు అభ్యసించారని సంస్థ రెక్టార్ డాక్టర్ మురు వల్లె తెలిపారు.

మాటల్లో కాదు చేతల్లో!

పాలస్తీనియన్లకు క్యూబన్ల సంఘీభావం

హవానా : 21వ శతాబ్దంలో మరింత మెరుగైన ప్రపంచాన్ని నిర్మించాలని కోరుకుంటున్న వారందరూ సాగించే పోరాటంలో పాలస్తీనియన్లు తమ జాతి విముక్తి కోసం సాగిస్తున్న పోరాటం ప్రముఖంగా నిలుస్తుంది. దశాబ్దాలుగా లాటిన్ అమెరికా దేశాల్లోని వామపక్షాలు పాలస్తీనియన్లు సాగించే పోరాటాలకు బలమైన మిత్రులుగా నిలుస్తూ వచ్చాయి. ఇటీవలి మాసాల్లో ఇజ్రాయిల్ సాగిస్తున్న ఊచకోతకు నిరసనగా పాలస్తీనియన్లు సాగిస్తున్న పోరుకు లాటిన్ అమెరికాలోని వామపక్ష ప్రభుత్వాలు, ఉద్యమాలు మద్దతు తెలియచేయడమే కాకుండా మాటలకు మించి చేతల్లో తమ తోడ్పాటును కనబరుస్తున్నాయి. ఈ ప్రాంతంలో ఈ ఉద్యమానికి సంబంధించి క్యూబా అగ్ర భాగంలో వుంది. 1950లో గాజాలోని శరణార్ధ శిబిరాలను చె గువేరా సందర్శించడం నుండి, 60, 70 దశకాల్లో పాలస్తీనా గెరిల్లాలకు ప్రత్యక్షంగా సాయమందించడమే కాకుండా 1973లో ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలన కూడా తెగతెంపులు చేసుకుంది. ఇటీవలి కాలంలో స్వతంత్ర దేశంగా అంతర్జాతీయ గుర్తింపు పొందేందుకు పాలస్తీనా చేసిన ప్రయత్నాలకు మద్దతునిస్తూ వచ్చింది.

తాజాగా అక్టోబరు 7న దాడులు ప్రారంభమైనప్పటి నుండి క్యూబన్ నేతలు ఇజ్రాయిల్ తీరును ఖండిస్తూనే వచ్చారు. కేవలం బహిరంగంగా ప్రకటనలు చేయడంతో క్యూబా ఆగిపోలేదు. చేతల్లో కూడా తన చేతనైన సాయాన్ని అందిస్తూ వచ్చింది. హవానాలోని లాటిన్ అమెరికన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ (ఇఎల్ఎఎం) ప్రపంచవ్యాప్తంగా గల విద్యార్థులకు బోధిస్తుంది. ముఖ్యంగా పేద దేశాల్లోని విద్యార్థులకు ప్రాధాన్యతనిస్తుంది. అందులో భాగంగా దాదాపు


బైడెన్‌ను 'నరమేధ జోయ్'గా అభివర్ణిస్తూ ఆందోళన చేస్తున్న క్యూబా సంఘీభావ బృందం

250మంది పాలస్తీనా విద్యార్ధులకు ఈ సంస్థ స్కాలర్‌షిప్‌లు అందచేస్తోంది. భవిష్యత్తులో ఈ విద్యార్థుల బృందం డాక్టర్లుగా వారి స్వదేశానికి వెళ్ళి సేవలందించేందుకు వీలుగా చర్యలు కూడా తీసుకుంటోంది. సంఘీభావ చర్యగా నవంబరు 17న 144మంది యువ పాలస్తీనా విద్యార్ధులతో క్యూబా అధ్యక్షుడు సమావేశమయ్యారు. 'మీ బాగోగులన్నింటినీ క్యూబా చూస్తుంది. మీ కెరీర్ రూపకల్పనలో మేం కూడా భాగస్వాములవుతాం. మీరందరూ పాలస్తీనా భవిష్యత్." అంటూ క్యూబా నేత వారిని ఉద్దేశించి ప్రసంగించారు. క్యూబా అధ్యక్షుడికి విద్యార్థులు తమ పోరాటానికి చిహ్నమైన తెలుపు, నలుపు రంగు స్కార్ఫ్‌ను బహుకరించారు. ఆ తర్వాత వారంలో నవంబరు 24న దాదాపు లక్షమంది ప్రజలు హవానాలో ప్రదర్శన నిర్వహించారు. పాలస్తీనియన్లకు మద్దతు ప్రకటించారు. ఇతర ప్రపంచ నేతల వైఖరికి పూర్తి విరుద్ధంగా అధ్యక్షుడు డియాజ్ కానెల్ ప్రదర్శన అగ్ర భాగాన నిలిచి పాలస్తీనియన్ల పోరాటానికి ప్రతీక అయిన నలుపు, తెలుపు స్కార్ఫ్‌ను ఊపుతూ అభివాదం చేశారు.

పాక్‌లో న్యుమోనియా విజృంభణ

- మూడు వారాల్లో 200 మందికి పైగా చిన్నారుల మృతి

ఇస్లామాబాద్ : పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్సులో న్యుమోనియా వ్యాధి విజృంభిస్తోంది. ఈ వ్యాధి కారణంగా గత మూడు వారాల్లోనే 200 మందికి పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. అతిశీతల వాతావరణం కారణంగా ఈ మరణాలు సంభవిస్తున్నట్లు పంజాబ్ ప్రావిన్సు ప్రభుత్వం వెల్లడించింది. 'పంజాబ్ ప్రావిన్సులో జనవరి 1 నుంచి ఇప్పటి వరకు 10 వేలకు పైగా న్యుమోనియా కేసులు నమోదయ్యాయి. 220 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. వీరంతా ఐదేళ్ల లోపు పిల్లలే. లాహోర్‌లోనే 47 మంది చనిపోయారు. గతేడాది 990 మంది న్యుమోనియాతో చనిపోయారు' అని పంజాబ్ ప్రావిన్సు అధికారులు శనివారం వెల్లడించారు. ప్రాణాలు కోల్పోతున్న వారిలో ఎక్కువ మంది పోషకాహార లోపం, న్యుమోనియా వ్యాక్సిన్ తీసుకోని వారని స్థానిక ప్రభుత్వం తెలిపింది. మరణించినవారంతా ఐదేళ్లలోపు వారేనని పేర్కొంది. అయితే న్యుమోనియాకు బ్యాక్టీరియా, వైరస్ కారణమని స్థానిక వైద్యాధికారులు తెలిపారు. వ్యాక్సిన్ తీసుకున్న వారికి రక్షణ ఉంటుందని వెల్లడించారు. అయినప్పటికీ కొన్నిసార్లు వైరల్ న్యుమోనియా సోకే ప్రమాదం కూడా ఉందని చెప్పారు. ఇప్పటికే పాఠశాలల్లో ఉదయం అసెంబ్లీపై నిషేధం విధించామని పేర్కొన్నారు. కొవిడ్ వైరస్ లానే న్యుమోనియా వేగంగా వ్యాపిస్తుందని వెల్లడించారు.

విద్యార్థుల నిరసనలకు ప్రతిగా బైఠాయించిన గవర్నర్ ఆరిఫ్ ఖాన్

రోడ్డుపై బైఠాయింపు డ్రామా

- కేరళ గవర్నరు వికృత పోకడలు!
- కేంద్రం వత్తాసు
- జడ్ ప్లస్ కేటగిరీ భద్రత

తిరువనంతపురం : కేంద్ర ప్రభుత్వ ఏజెంట్‌లా వ్యవహరిస్తూ జగడాలమారిగా పేరొందిన కేరళ గవర్నరు అరిఫ్ మహ్మద్ ఖాన్ వికృత పోకడలు అంతకంతకూ శ్రుతిమించుతున్నాయి. కేరళలో శనివారం నాడు ఆయన ప్రవర్తించిన తీరు అందరినీ విస్మయానికి గురిచేసింది. కేరళ రాష్ట్ర గవర్నరు ఆరిఫ్ మహ్మద్ ఖాన్‌కు కేంద్ర ప్రభుత్వం సిఆర్‌పిఎఫ్ బలగాలతో జడ్ ప్లస్ కేటగిరి భద్రత కల్పించింది. విద్యార్థులు శాంతియుతంగా నిరసన తెలపడాన్ని సహించలేని గవర్నరు రోడ్డు పక్కన కుర్చీ వేసుకుని గంటసేపు బైఠాయించారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను తొక్కిపెట్టడం, కేంద్ర ప్రభుత్వ వినాశకర విధానాలకు మద్దతుగా గళాన్ని వినిపించడం, విశ్వవిద్యాలయాలపై పెత్తనం సాగించాలనుకోవడం వంటి చర్యల నేపథ్యంలో ఆరిఫ్ పట్ల రాష్ట్రవ్యాప్తంగా కొద్దిరోజులుగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. దానిలో భాగంగానే విద్యార్థులు నల్ల జెండాలతో ఎదురేగి నిరసన తెలిపారు. శాంతియుతంగా నిరసనలు తెలిపిన వారిని అరెస్టు చేయాలని, కేసులు పెట్టి ఆ కాపీ తెచ్చేదాకా తాను ఇక్కడి నుంచి లేవనంటూ బీష్మించుక్కూర్చొన్నారు. అంతేకాదు నీలామల్ ప్రాంతం వద్ద కారు దిగి వారితో విద్యార్థులతో వాగ్వాదానికి దిగారు. శాంతి భద్రతలను పర్యవేక్షించే అధికారులపైనా ఆయన రుసరుసలాడారు. దాడికి పాల్పడే వారిని పోలీసులు ప్రోత్సహించేలా ముఖ్యమంత్రి విజయన్ చర్యలు తీసుకున్నారంటూ నిందలేశారు. అత్యంత నాటకీయంగా రోడ్డు పక్కనే గల టీ దుకాణంలోని కుర్చీని లాక్కుని గంట పాటు అక్కడే కూర్చుండిపోయారు. పోలీసులు వెంటనే ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి ఆ కాపీ తీసుకువచ్చి ఇచ్చేవరకు అక్కడే వున్నారు. ఖాన్ బృందం ఆ కాపీని కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ఇ మెయిల్ చేశారు. ఆ వెనువెంటనే గవర్నర్‌కు, రాజ్‌భవన్‌కు సిఆర్‌పిఎఫ్ సిబ్బందితో భద్రతను పెంచుతున్నట్లు ఆదేశాలు జారీ అయ్యాయి.

గవర్నర్ అనాలోచిత ప్రవర్తన కేరళకే సవాలు : పినరయి విజయన్

గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ ప్రవర్తన అపరిపక్వంగా ఉందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. గవర్నర్ కొంత కాలంగా వ్యవహరిస్తున్న తీరు ఏమీ బాగోలేదు. ఆయనకు ఏమైందో తెలియదు. ఇప్పుడు ఆయన చేస్తున్నది కేరళ మొత్తానికి సవాల్ అని ముఖ్యమంత్రి విలేకరుల సమావేశంలో అన్నారు. పదవుల్లో ఉన్నవారిపై నిరసనలు రావడం సహజం. ఇలాంటి నిరసనలు జరిగినప్పుడు అధికార స్థానాల్లో ఉన్నవారి వైఖరి ఎలా ఉంటుందన్నదే ముఖ్యం. నిరసనలపై ఈ గవర్నర్ వ్యవహరించిన తీరు ముమ్మాటికీ ఆక్షేపణీయం.. సాధారణ భద్రతా చర్యలకు విరుద్ధంగా గవర్నర్ ఇప్పుడు వ్యవహరించారు. ఆందోళనకారులను నిలువరించడం పోలీసుల బాధ్యత. గవర్నర్ మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఎఫ్‌ఐఆర్‌ను పట్టించుకోకుండా ఉండబోమని ఓ అధికారి చెప్పడం ఇదే తొలిసారి. ప్రస్తుతం సీఆర్పీఎఫ్‌కి భద్రతను అప్పగించారు. రాష్ట్ర అధినేతకు ప్రభుత్వం అత్యుత్తమ భద్రతను కల్పించింది. గవర్నర్ భద్రతను కేంద్రానికి అప్పగించడం విచిత్రంగా కనిపిస్తోంది. కేరళలోని కొందరు ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులకు కేంద్రం భద్రత కల్పించింది. ఆ జాబితాలోకి గవర్నర్ కూడా చేరారు. గవర్నర్ కోరుకున్నట్లు సీఆర్పీఎఫ్ పనిచేయగలదా? చట్టం అధికారానికి మించినది. గవర్నర్ వైఖరి ఏమాత్రం అర్థం కావడం లేదన్నారు. ఇలాంటి విషయాల్లో విజ్ఞత ప్రదర్శించాలి. ఇప్పటి వరకు గవర్నర్‌ను కోరలేదు. ఉన్నత పదవుల్లో ఉండాల్సిన వారు చూపాల్సిన పరిపక్వత గవర్నర్‌కు లేదు. ఇటువంటి వ్యక్తిని కేరళ ఇప్పటి వరకు చూడలేదు. కేరళకు సవాల్ గవర్నరే. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభ సందర్భంగా గవర్నరు వ్యవహరించిన తీరు అవమానకరం. రాజ్యాంగాన్ని కూడా అవమానించడమే. విధాన ప్రకటన ప్రసంగం చదవడానికి సమయం దొరకని గవర్నర్ ఒక గంట పాటు రోడ్డుపైనే బైఠాయించారు. చట్టం అన్నిటికంటే ఉన్నతమైనదని గవర్నర్‌తో సహా అందరూ అర్థం చేసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు.

పరువు నష్టం కేసులో ట్రంప్‌నకు ఎదురుదెబ్బ

- రూ.692 కోట్ల భారీ జరిమానా

న్యూయార్క్ : పరువునష్టం కేసులో అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ ఎదురుదెబ్బ

తిన్నారు. మన్‌హటన్ ఫెడరల్ కోర్టు 83.3 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీ ప్రకారం దాదాపు 692 కోట్ల రూపాయలు) మేర ఆయనకు భారీ జరిమానా విధించింది. ట్రంప్ తన పరువుకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ అమెరికాకు చెందిన మాజీ కాలమిస్ట్ జీన్ కరోల్ దాఖలు చేసిన కేసులో న్యూయార్క్‌లోని మన్‌హటన్ ఫెడరల్ కోర్టు ఈ మేరకు తీర్పు ఇచ్చింది. నష్ట పరిహారం కింద దాదాపు 152 కోట్ల రూపాయలు, భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా మరో 540 కోట్ల రూపాయలు చెల్లించాలని ట్రంప్‌ను ఆదేశించింది. కాగా, ఫెడరల్ కోర్టు తీర్పు హాస్యాస్పదమన్న ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా న్యాయవ్యవస్థ నియంత్రణ కోల్పోయిందన్నారు. బైడెన్ ప్రభుత్వం న్యాయవ్యవస్థను రాజకీయ ఆయుధంగా వాడుతోందని ఆరోపించారు. ఫెడరల్ కోర్టు తీర్పును సవాల్ చేయనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు.

డీప్ ఫేక్ కలకలం...!

అమెరికాలో అధ్యక్ష ఎన్నికల వేళ ... డీప్ ఫేక్ కాల్స్ కలకలం రేపాయి. ఈ ఎన్నికల్లో ఓటెయ్యొద్దు .. అంటూ జోబైడెన్ వాయిస్‌తో ఓటర్లకు డీప్ ఫేక్ కాల్స్ వెళ్లాయి. దీనిపై వైట్‌హౌస్ స్పందించింది. ప్రముఖ గాయని టేలర్ స్విఫ్ట్ కు చెందిన అభ్యంతరకర దృశ్యాలపై కూడా వైట్ హౌస్ ఆందోళన వ్యక్తం చేసింది.

వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ మాట్లాడుతూ ... తప్పుడు చిత్రాలు, సమాచార వ్యాప్తిపై తాము తీవ్ర ఆందోళన చెందుతున్నామన్నారు. సమస్య పరిష్కారానికి చేయగలిగిందంతా చేస్తామని చెప్పారు. ఈ డీప్ ఫేక్ కాల్స్‌ను కట్టడి చేసే విషయంలో సామాజిక మాధ్యమ సంస్థలదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు. ఎక్స్(ట్విటర్) వంటి సంస్థల్లో నిబంధనలు ఉన్నప్పటికీ.. టేలర్ స్విఫ్ట్ కు సంబంధించిన అభ్యంతరకర దశ్యాలను తొలగించలేకపోయారని ఆరోపించారు. అవి 17 గంటల పాటు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. 45 మిలియన్లకుపైగా వ్యూస్ వచ్చాయి. ఈ అభ్యంతరకర చిత్రాలపై టేలర్ స్విఫ్ట్ చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. కాగా రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం జరుగుతున్న ప్రైమరీ ఎన్నికల్లో ట్రంప్ ఇప్పటికే అయోవా, న్యూ హ్యాంప్‌షైర్‌లో విజయం సాధించిన సంగతి తెలిసిందే. అధ్యక్ష పదవికి నామినేషన్ కోసం పోటీపడిన రిపబ్లికన్ పార్టీ అభ్యర్థుల్లో ముగ్గురు ఇప్పటికే తప్పుకున్నారు. దీంతో ప్రస్తుతం పోటీ అంతా ట్రంప్, భారత సంతతికి చెందిన నిక్కీ హేలీ మధ్యే ఉంది.

కారును ఢీకొన్న ట్రక్కు..

- పంజాబ్‌లో ఐదుగురు మృతి

హోషియార్పూర్ : పంజాబ్‌లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు మృతి చెందారు. కారులో చెలరేగిన మంటల వల్ల వారంతా సజీవదహనమయ్యారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగినట్లు పోలీసులు శనివారం వెల్లడించారు. ఇక ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. శుక్రవారం రాత్రి పంజాబ్‌లోని జలంధర్ - పఠాన్‌కోట్ రహదారిపై ట్రక్కు కారును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. జలంధర్ నుంచి మొకేరియన్‌కు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు దసూయా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సబ్ ఇన్‌స్పెక్టర్ హర్ప్రేమ్ సింగ్ తెలిపారు. కారు ఉండి బస్సి గ్రామం వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది. ఆ తర్వాత రోడ్డుకు అవతలివైపు నుంచి ఎదురుగా వస్తున్న ట్రక్కు కారును ఢీకొట్టింది. దీంతో కారులో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో కారులో ఉన్న నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తిని సివిల్ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. హర్యానాకు చెందిన ట్రక్ డ్రైవర్ సుశీల్ కుమార్‌కు కూడా గాయాలయ్యాయి. ఈ ఘటనపై విచారణ కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

మీ కోసం

బియ్యం పురుగు పట్టకుండా ఉండాలంటే అందులో నాలుగు ఎండు మిరపకాయలు వేసి ఉంచాలి.

జీవన సౌరభం

మన లోపాలను మనం గ్రహించడం అన్నింటికన్నా గొప్ప చదువు.

మొక్కల సంరక్షణ

పూట కూళ్ళ పెద్దమ్మ తన ఇంటి పెరట్లో బీర, చిక్కుడు, అనప, బెండ మొదలైన కూరగాయ విత్తులను నాటింది. కొన్ని రోజులకు ఆ విత్తనాలు మొలకెత్తాయి. ఒకరోజు ఆడుకోవడానికి అటుగా వచ్చిన రుద్ర, ఆ చిన్న మొక్కలను పీకడం మొదలు పెట్టాడు. అదిచూసిన పెద్దమ్మ 'ఒరేయ్ భడవా మొక్కే కదా అని పీకేస్తే తిండిలేక చస్తాం' అని అరుస్తూ రుద్రని ఇంట్లోకి తీసుకువచ్చింది. పెద్దమ్మ ఎందుకు అరుస్తున్నదో, ఎందుకు తిడుతున్నాదో వాడికి అర్థం కాలేదు. బుజ్జి బుజ్జి మొక్కలు చేత్తో పట్టుకుని పైకి లాగగానే వచ్చేస్తున్నాయి. అదెంతో వింతగాను, సరదాగా అనిపించింది రుద్రకి.

ఎప్పుడు ఏ సరదా పని చేసినా ఊరుకునే పెద్దమ్మ ఈసారి ఎందుకు అరిచిందో తెలియక 'మొక్కలని పీకితే ఏమౌతుంది పెద్దమ్మా' అని అమాయకంగా అడిగాడు.

'చచ్చి ఊరుకుంటాయి' అని కోపంగా జవాబిచ్చింది పెద్దమ్మ. 'పెద్దమ్మా నువ్వు ఎందుకు ఇంత కోపంగా ఉన్నావో నాకు అర్థం కావడం లేదు. ఆ మొక్కలు పీకుతుంటే నాకు భలే సరదాగా అనిపిస్తోంది. అందుకే అలా చేశాను' అంటూ ఏడుపు లంకించుకున్నాడు రుద్ర.

'విషయం చెప్పకుండా పిల్లాడిమీద ఊరికే విసుక్కుంటే ఏం లాభం!' అని ఆలోచించింది పెద్దమ్మ. ఇంట్లోకి వెళ్లి కోడి పట్టు(పొదగడానికి ఉంచిన గుడ్లు)లో నుంచి ఒక గుడ్డును తెచ్చి రుద్రకి చూపించింది. 'చూడూ దీన్ని పగల కొడితే ఏమౌతుంది?' అని అడిగింది.

'పగిలి పోతుంది' అని సమాధానమిచ్చాడు రుద్ర. 'గుడ్డును పగలగొట్టడం వల్ల అందులోని నుంచి పిల్ల రాదు. అదే గుడ్డు 21 రోజులు కోడి పెట్ట కింద ఉంటే ఆ గుడ్డులో నుండి పిల్ల బయటికి వస్తుంది. కోడి పిల్ల పెరిగి పెద్దదైతే మళ్లీ మనకు బోలెడు గుడ్లు పెడుతుంది. వాటిని ఆహారంగా ఉపయోగించుకోవచ్చు. అలాగే ఈ చిన్న చిన్న మొక్కలు ఎంతో ఉపయోగకారిగా ఉంటాయి. కూరగాయలు, పూలు, ఆకుకూరలు ఇచ్చే ఈ మొక్కలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. పెరట్లో పచ్చని మొక్కలు ఉంటే స్వచ్ఛమైన ప్రాణవాయువును పీల్చుకోవచ్చు. కాబట్టి చిన్నవైనా, పెద్దవైనా మొక్కలను పీకకూడదు' అని వివరించి చెప్పింది. పెద్దమ్మ మాటలు శ్రద్ధగా విన్న రుద్ర ఆ రోజు నుండి మొక్కలను పీకడం మానేశాడు. పెద్దమ్మతో పాటు పాదులు తీసి, నీళ్లు పోశాడు. పెద్దమ్మ పెరటంతా కూరగాయలు, పూల మొక్కలతో ఎంతో ఆహ్లాదంగా తయారైంది.

నీతి : ప్రకృతిని సంరక్షించుకోవాలంటే మొక్కలను రక్షించుకోవాలి.

- కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

నేను గీసిన బొమ్మ

సిహెచ్. చాందిని,
10వ తరగతి, ప్రభుత్వ పాఠశాల,
పెంటపాడు మండలం, పశ్చిమగోదావరి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

గవదబిళ్ళలు అంటువ్యాధే...

దేశంలోని అనేక రాష్ట్రాల్లో గవద బిళ్లలు (పారా మిక్సోవైరస్) వ్యాధి వ్యాపిస్తోంది. చాలాకాలం తర్వాత మళ్లీ ఈ కేసులు విజృంభిస్తుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కొద్దిరోజులుగా మహారాష్ట్ర, తెలంగాణాలో ఈ కేసులు ఎక్కువగా నమోదవుతున్న విషయం తెలిసిందే. ముంబై, హైదరాబాద్ వంటి నగరాల్లో ఈ వ్యాధి ఎక్కువగా వ్యాప్తిస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా చలికాలంలోనే ఇవి వస్తుంటాయి. నవంబర్ నుంచి ఫిబ్రవరి మధ్య ఇవి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. చాలామంది పిల్లలు దీని భారినపడుతున్నారు. సహజంగా గవదబిళ్లలు గొంతుకు రెండు వైపులా వస్తాయి. కానీ కొన్ని ప్రత్యేక కేసుల్లో ఇవి చెవులు, క్లోమం (పాంక్రియాస్), జననేంద్రియాల వద్ద కూడా వస్తాయి. కొన్ని జాగ్రత్తలతో ఈ వ్యాధి పిల్లల్లో వ్యాపించకుండా అరికట్టొచ్చు. అసలు గవద బిళ్లలు అంటే ఏమిటి? వాటి లక్షణాలు ఏమిటి? అనేది తెలుసుకుందాం.

గవదబిళ్లలనేవి వైరల్ వ్యాధి. దగ్గు, జబులు, లేదా మాట్లాడేటప్పుడో ఈ వైరస్ పిల్లల శరీరంలోకి ప్రవేశిస్తుందని డాక్టర్లు చెబుతున్నారు. శీతాకాలంలో పిల్లల్లో కన్పించే అంటువ్యాధుల్లో ఇది కూడా ఒకటి. చెవులు కింద ముఖానికి ఇరువైపులా ఉన్న గవదల భాగంలోని లాలాజల గ్రంథులకు బాధాకరమైన వాపును కలిగించి బాధించే రుగ్మతే ఇది. గవదబిళ్ళలు ఒకటి లేదా రెండు గ్రంథులను ప్రభావితం చేయొచ్చు. ఫలితంగా లాలాజల గ్రంథులు ఒకటి లేదా రెండూ ఉబ్బుతాయి. ఈ వ్యాధి ప్రభావం 14 నుంచి 18 రోజుల వరకూ ఉంటుంది. వచ్చిన తర్వాత 7 నుంచి 10 రోజుల వరకూ ఉంటాయి. వ్యాప్తి ప్రారంభమైనప్పుడు అది టీకాలు వేయని వ్యక్తులను ప్రభావితం చేస్తుంది. సాధారణంగా దగ్గరలో ఉండేవారికి వ్యాప్తిస్తుంది. ఇవి వస్తే ప్రధానంగా ఆరోగ్య సమస్యల్లో వినికిడిలోపం, మెదడువాపు, ఆర్కిటిస్, వృషణ, మెనింజైటిస్ వంటివి కనిపిస్తాయి.

పిల్లల్లోనే ఎక్కువ కేసులు

గవద బిళ్లలు వచ్చినప్పుడు ఒక్కోసారి రెండు వైపులా దవడలు వాపునకు గురౌతాయి. ఇలాంటి సమయంలో పిల్లలు ఏమీ తినలేరు. తాగలేరు, ఇది వారి జీర్ణ వ్యవస్థపైనా ప్రభావం చూపుతుంది. దీంతోపాటు జ్వరం, గొంతులో ఇన్ఫెక్షన్ కూడా కన్పిస్తాయి. బాలికల్లో పొత్తికడుపు నొప్పి కూడా ఉంటుంది. లక్షణాలు క్రమంగా కనిపిస్తాయి. రెండు వారాల్లో ఈ లక్షణాలు మాయమై రోగి సాధారణ స్థితికి వచ్చేస్తారు. చాలా అరుదైన సందర్భాల్లో మాత్రమే ఇవి తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంటాయని డాక్టర్లు చెబుతున్నారు. ఇది సోకిన పిల్లలను బడికి పంపకుండా ఇంట్లోనే ఏకాంతంగా ఉంచాలనీ, లక్షణాలుంటే మాస్క్ లేకుండా బయటకు పంపకూడదని నిపుణులు సూచిస్తున్నారు.

లక్షణాలు ఇవే...

- దవడవాపు, నొప్పిగా ఉండటం
- తలనొప్పి
- కీళ్ళనొప్పి
- నోరు ఎండిపోవడం
- ఆకలి లేకపోవడం
- జ్వరం
- బలహీనత
- వృషణాల్లో నొప్పి
- గందరగోళం
- చిరాకు
- జాగ్రత్తలు ఇవే
- సోకిన వారు ఐసోలేషన్‌లో ఉండటం మేలు
- పోషకాహారం తీసుకోవాలి
- తగినంత విశ్రాంతి తీసుకోవాలి
- వైద్యుల సూచన మేరకు జ్వరం, నొప్పులకు మందులు వాడాలి
- ఫేస్ మాస్కులు వాడాలి
- పిల్లలకు ఎంఎంఆర్ (మీజిల్స్, మంప్స్, రుబెల్లా) టీకాలు వేయించాలి

వైద్య పరీక్షలు

రాకుండా ఉండేందుకు టీకాలు, మందులు వాడొచ్చు

- రక్త పరీక్షలు చేయించుకోవాలి
- ముఖ జీవకణ (నోటికి సంబంధించిన), మూత్ర పరీక్షలు
- ఇది వైరస్ వల్ల సంభవించినందున యాంటీబయోటిక్స్ మందులు ప్రభావవంతంగా పనిచేయవు. శరీరంలోని రోగ నిరోధకశక్తి వ్యాధి కారక సూక్ష్మజీవితో (వైరస్)తో పోరాడే వరకూ ఈ లక్షణాలు ఉపశమనం చేసుకునే ప్రయత్నం చికిత్సలో భాగంగా జరుగుతుంది.
- వ్యాప్తిని తగ్గించటానికి రోగిని ఇతరులకు దూరంగా ఉంచాలి
- జ్వరం తగ్గటానికి పారాసెటమాల్ మందులు వాడాలి
- వాపు తగ్గటం కోసం వెచ్చని కాపడం లేదా చల్లని అద్దకాలు మేలు
- నమిలే ఆహారం కాకుండా మెత్తటి ఆహారాన్ని తినిపించటం మంచిది ద్రవాహారాల్ని ఎక్కువగా తీసుకోవాలి
- వ్యాక్సిన్ ద్వారా సులభంగా నివారించగలిగే లాలాజల గ్రంధులను ప్రభావితం చేసే అంటు వైరల్ ఇన్‌ఫెక్షన్.

వైరస్‌తో వ్యాప్తి

పారామిక్సో కుటుంబానికి చెందిన వైరస్ (సూక్ష్మజీవి)తో గడ్డలు ఏర్పడతాయి. వాతావరణంలో గాలిబిందువులతో గాలి ద్వారా ఈ సూక్ష్మజీవులు ముక్కులేదా నోటి ద్వారా మనుషుల శరీరాల్లోకి ప్రవేశిస్తాయి. చాలా వైరల్ వ్యాధుల్లాగేనే వీటికి కూడా ప్రత్యేకమైన చికిత్సేమీ లేదు. లక్షణాలను బట్టి డాక్టర్లు మందులు ఇస్తారు. దీంతోపాటు మల్టీ విటమిన్, మల్టీ మినరల్ టాబ్లెట్లు కూడా ఇస్తారు. వ్యాక్సిన్ వేసుకోవాలని సూచిస్తుంటారు. సాధారణ వ్యాధిలా భావించి ఇంట్లో వైద్యం చేయటం ఏమాత్రం సరికాదనీ, డాక్టరును సంప్రదించటమే మేలని పేర్కొంటున్నారు. ఈ వ్యాధి సోకిన 10 మందిలో ఒకరికి మెదడు వాపు వచ్చే అవకాశం ఉంది. ఈ రోగుల వీర్య కణాల ఉత్పత్తి తగ్గిపోవటం వల్ల భవిష్యత్తులో పిల్లలు పుట్టకపోవచ్చు. 20వేల మందిలో ఒకరికి చెవుడు కూడా వస్తుంది. 10 వేల మందిలో ఒకరు మరణించే అవకాశం ఉంది. ఈ వ్యాధి ఇతర వ్యక్తులకు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే వ్యాధి సోకిన వ్యక్తి తుమ్ముతున్నప్పుడు, దగ్గుతున్నప్పుడు నోటికి, ముక్కుకు అడ్డంగా చేతి రుమాలు ఉంచుకోవటం చాలా ముఖ్యం.

టీకాతో నివారించొచ్చు

దేశంలో ఏడాదికి లక్ష కంటే తక్కువ కేసులు వస్తుంటాయి. అరుదుగా వచ్చే ఈ వ్యాధిని టీకా ద్వారా నివారించొచ్చు. వైద్య నిపుణుల ద్వారా చికిత్సలు పొందాలి. నిర్ధారణలు కూడా అవసరమే. ల్యాబ్ పరీక్షలు లేదా ఇమేజింగ్ తరచుగా అవసరం ఉంటుంది. సులభంగా వ్యాపించే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి. పానీయాలు పంచుకోవడం, పిల్లలను అదేపనిగా ముద్దులు పెట్టుకోవడం వల్ల లాలాజలం ద్వారా ఎక్కువగా వ్యాపిస్తుంది. రెండువారాల్లో తగ్గిపోతుంది. ఎంఎంఆర్ వ్యాక్సిన్ ద్వారా ఈ వ్యాధిని నివారించొచ్చు. నాన్ స్టెరాయిడ్ యాంటీ ఇన్ఫ్లమేటరీ డ్రగ్, అలాల్జేసిక్‌లను వాడొచ్చు.

-డాక్టర్ పి.శివశంకర్
కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా.

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

మహిళల సింగిల్స్ టైటిల్ విజేత సబలెంక

ఫైనల్లో కిన్వెన్ జంగ్‌పై గెలుపు

రన్నరప్ ట్రోఫీతో కిన్వెన్ జెంగ్(చైనా)

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను బిడ్డ తల్లి, 25ఏళ్ల అర్యానా సబలెంక చేజిక్కించుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన సబలెంక ఈ ఏడాది టైటిల్‌ను చేజిక్కించుకొనే క్రమంలో ఒక్క సెట్‌నూ ప్రత్యర్థికి సమర్పించుకోకుండా టైటిల్‌ను ఒడిసిపట్టుకుంది. అలాగే బెలారస్ తరఫున వరుసగా రెండుసార్లు ఈ టైటిల్‌ను నెగ్గిన రెండో క్రీడాకారిణిగానూ సబలెంక రికార్డు నెలకొల్పింది. అంతకుముందు విక్టోరియా అజరెంకా 2012, 13లో రెండు పర్యాయాలు ఈ టైటిల్‌ను నెగ్గి తొలుత చరిత్ర నెలకొల్పగా.. తాజాగా సబలెంకా ఆ రికార్డును సమం చేసింది. రాడ్ లేవర్ ఎరీనాలో శనివారం జరిగిన ఫైనల్లో సబలెంక 6-3, 6-2 తేడాతో వరుస సెట్లలో కిన్వెన్ జెంగ్(చైనా)పై వరుససెట్లలో విజయం సాధించింది.

తొలి సెట్‌లో కాస్త పోరాడిన జెంగ్.. రెండో సెట్‌లో ఏమాత్రం ప్రతిఘటన చూపలేకపోయింది. రన్నరప్‌గా నిలిచిన చైనా క్రీడాకారిణి 21ఏళ్ల జెంగ్.. పదేళ్ల తర్వాత చైనా తరఫున ఫైనల్‌కు మరో క్రీడాకారిణిగా తన పేరును లిఖించుకుంది. కానీ తుదిపోరులో మాత్రం సబలెంకకు చిత్తుచేయడంలో తడబడింది. టైటిల్ నెగ్గిన సబలెంకకు 31.50లక్షల ఆస్ట్రేలియన్ డాలర్లు, రన్నరప్ కిన్వెన్ జెంగ్‌కు 17.25లక్షల ఆస్ట్రేలియన్ డాలర్ల ప్రైజ్‌మనీ దక్కింది.

చరిత్ర సృష్టించిన బోపన్న

43ఏళ్ల వయసులో పురుషుల డబుల్స్ టైటిల్

మెల్‌బోర్న్: భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న చరిత్ర సృష్టించాడు. 43ఏళ్ల వయసులో గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన ఆటగానిగా రికార్డు నెలకొల్పాడు. సెమీస్‌కు చేరి నెంబర్ వన్ ర్యాంక్‌తో చరిత్ర లిఖించిన బోపన్న.. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో ఇటలీ ద్వయంపై విజయం సాధించారు. హోరాహోరీగా సాగిన ఫైనల్లో రోహన్ బోపన్న-మాథ్యూ ఎబ్డెన్(ఆస్ట్రేలియా) జోడీ 7-6(7-0), 7-5తో సిమోన్ బోలెల్లి-ఆండ్రియా వావ్సోరిలను చిత్తుచేశారు. తొలి పాయింట్ నుంచి ఇరువురు హోరాహోరీగా తలపడ్డారు. మొదటి సెట్ ట్రైబ్రేక్‌కు దారితీయగా.. ఆ సెట్ 7-0 పాయింట్లతో రోహన్ జోడీ నెగ్గింది. ఇక రెండో సెట్‌లోనూ ఆటగాళ్లు విజయం కోసం నువ్వా నేనా? అన్నట్లు పోరాడారు. ఒక దశలో రోహన్ జోడీ 3-4తో వెనకబడినా అద్భుతంగా పుంజుకొని సెట్‌ను 7-5 తేడాతో నెగ్గి ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా నిలిచింది. తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను గెలిచిన రోహన్ బోపన్న 2017లో కెనడాకు చెందిన గాబ్రియేలా డాబ్రొయెస్కీతో కలిసి ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ విజేతగా నిలిచాడు. పురుషుల విభాగంలో లియాండర్ పేస్, మహేశ్ భూపతి తర్వాత గ్రాండ్‌స్లామ్ నెగ్గిన మూడో భారత ఆటగాడు రోహన్ బోపన్న. మహిళల విభాగంలో సానియా మీర్జా ఎక్కువ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను నెగ్గింది. దీంతో 43ఏళ్ల 329రోజుల వయసులో ఓ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను కైవసం చేసుకున్న పెద్ద వయస్కునిగా రికార్డు నెలకొల్పాడు. గతంలో ఈ టోర్నమెంట్‌లో ఒక్కసారి కూడా మూడోరౌండ్ దాటని బోపన్న.. యుఎస్ ఓపెన్‌లో 2010, 2023లో ఫైనల్‌కు చేరి రన్నరప్‌తో సరిపుచ్చుకున్నాడు. ఈ క్రమంలో 17వ పర్యాయం ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సాధించి తన కలను సాకారం చేసుకున్నాడు. గతేడాది బోపన్న-ఎబ్డెన్ ద్వయం యుఎస్ ఓపెన్ ఫైనల్‌కు చేరి ఓటమిపాలైంది. 20 ఏళ్ల క్రితం అంతర్జాతీయ టెన్నిస్‌లోకి అరంగేట్రం చేసిన బొప్పన్న.. ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మూడవ ర్యాంక్ ప్లేయర్‌గా బరిలోకి దిగాడు. గ్రాండ్‌స్లామ్ సెమీస్‌కు చేరడంతో వచ్చే వారం ప్రకటించే ఏటిపి ర్యాంకింగ్స్‌లో అతను టాప్ ర్యాంక్‌లో నిలవనున్నాడు. బోపన్న భాగస్వామి మాథ్యూ ఎబ్డెన్ రెండవ ర్యాంక్‌లో నిలిచే ఛాన్సు ఉంది. డబుల్స్ విజేత రోహన్ బోపన్న-ఎబ్డెన్ జోడీకి 7.20లక్షల ఆస్ట్రేలియన్ డాలర్లు, రన్నరప్ ఇటలీ జంటకు 3.65లక్షల ఆస్ట్రేలియన్ డాలర్ల ప్రైజ్ మనీ దక్కింది.

ఆంధ్ర 431ఆలౌట్
ఛత్తీస్‌గడ్‌తో రంజీట్రోఫీ

రాయ్‌పూర్: ఛత్తీస్‌గడ్‌తో జరుగుతున్న రంజీట్రోఫీ మ్యాచ్‌లో ఆంధ్రజట్టు తొలి ఇన్నింగ్స్‌లో 431పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోర్ 277పరుగులతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర జట్టును మాజీ కెప్టెన్ హనుమ విహారి(183) ఆదుకున్నాడు. లోయర్ ఆర్డర్ బ్యాటర్ గిరినాథ్(36), శశికాంత్(42) బ్యాటింగ్‌లో రాణించారు. ఛత్తీస్‌గడ్ బౌలర్లు రవికిరణ్‌కు ఏడు, సౌరభ్ మజుందార్‌కు రెండు, వాసుదేవ్‌కు ఒక వికెట్ దక్కాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఛత్తీస్‌గడ్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 3వికెట్ల నష్టానికి 118పరుగులు చేసింది. రిషబ్(38), అశోతోష్(23) బ్యాటింగ్‌లో రాణించారు. క్రీజ్‌లో కెప్టెన్ అమన్‌దీప్(28), సంజీత్(12) ఉన్నారు. ఆంధ్ర బౌలర్లు గిరినాథ్‌కు రెండు, నితీశ్‌కు ఒక వికెట్ దక్కాయి.

భారత ప్రభుత్వం
రసాయనాలు & ఎరువుల మంత్రిత్వ శాఖ
ఫార్మాస్యూటికల్స్ విభాగం
प्रधानमंत्री भारतीय जन औषधि परियोजना

జన్ ఔషధి కేంద్రాలు నాణ్యమైన మందులను సరసమైన ధరలకు మరియు 75% వరకు తగ్గింపుతో అందిస్తాయి.

మోడీ సర్కార్ యొక్క హామీ

"తక్కువ ధరలకు నాణ్యమైన ఔషధాల లభ్యతను నిర్ధారించడానికి, దేశవ్యాప్తంగా వేలాది జన్ ఔషధి కేంద్రాలు ప్రారంభించబడ్డాయి. ఇవి పేదలకే కాకుండా మధ్యతరగతి వర్గాలకు కూడా ఎంతో మేలు చేశాయి."
- నరేంద్ర మోడీ, ప్రధాని

ఇప్పుడు
జన్ ఔషధి కేంద్రాలు మంచి ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి

ప్రధాన మంత్రి భారతీయ జన్ ఔషధి పరియోజన కింద జన్ఔషధి కేంద్రాల సంఖ్యను 25,000 వరకు పెంచే ప్రాజెక్టును గౌరవనీయులైన ప్రధాన మంత్రి శ్రీ.నరేంద్ర మోదీ ప్రారంభించారు.
దేశంలోని ప్రతి జిల్లాలో జన్ ఔషధి కేంద్రాన్ని తెరవడానికి దరఖాస్తులు ఆహ్వానించబడ్డాయి.

దరఖాస్తుదారులు గమనించగలరు

- కనీసం 120 చదరపు అడుగుల దుకాణం అవసరం
- 1కి.మీ దూరం నిర్వహించడానికి రెండు జన్ ఔషధి కేంద్రాలు. (గతంలో ఇది 1.5 కి.మీ.)
- ఏదైనా వ్యక్తి, సంస్థ, NGO, మెడికల్ కాలేజీ, ప్రభుత్వ ఆసుపత్రి, PACS/ సహకార సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చు.
- జన్ ఔషధి కేంద్రాన్ని అమలు చేయడానికి ఫార్మసిస్ట్ (బి.ఫార్మా/డి.ఫార్మా) లభ్యత తప్పనిసరి.

పరియోజన యొక్క ముఖ్య లక్షణాలు

- జన్ ఔషధి కేంద్రాన్ని ప్రారంభించేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం
- మహిళా పారిశ్రామికవేత్తలు, వికలాంగులు, SC/ST, మాజీ సైనికులు, ఈశాన్య రాష్ట్రాలు, హిమాలయ కొండ ప్రాంతాలు, ద్వీప సమూహాలు మరియు 112 ఆకాంక్షాత్మక జిల్లాలకు రూ.2 లక్షల అదనపు ఆర్థిక సహాయం.
- అన్ని ఔషధాలపై గరిష్టంగా 20% మార్జిన్

మరింత సమాచారం కోసం/ఆన్‌లైన్ దరఖాస్తు కోసం వెబ్‌సైట్: www.janaushadhi.gov.in ని సందర్శించండి లేదా టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ 1800 180 8080 పై కాల్ చేయండి లేదా ఇక్కడ స్కాన్ చేయండి.

రసవత్తరంగా ఉప్పల్ టెస్ట్

- పోప్ అజేయ సెంచరీ
- ఇంగ్లండ్‌కు 126పరుగుల ఆధిక్యం
- నాల్గోరోజు ఆట కీలకం



హైదరాబాద్: భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న ఉప్పల్‌లో జరుగుతున్న తొలి టెస్టు రసవత్తరంగా మారింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌కు ఆధిక్యత లభించగా.. మూడోరోజు ఆట ఇంగ్లండ్ జట్టు ఇప్పటికే 126పరుగుల ఆధిక్యతను సంపాదించి. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ బ్యాటర్ ఓలీ పోప్ (148నాటౌట్; 17ఫోర్లు) అజేయ శతకంతో రాణించి ఇంగ్లండ్‌ను ఆదుకున్నాడు. దీంతో ఇంగ్లండ్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 77 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 316 పరుగులు చేసింది. క్రీజ్‌లో పోప్‌తో పాటు రెహాన్ అహ్మద్(16బ్యాటింగ్) ఉన్నాడు. అంతకుముందు భారత్‌ను 436 పరుగులకు పరిమితం చేసిన ఇంగ్లండ్.. రెండో ఇన్నింగ్స్‌ను దూకుడుగా ప్రారంభించింది. ఓపెనర్లు జాక్ క్రాలే(31), బెన్ డకెట్(47)లు ధాటిగా ఆడి తొలి వికెట్‌కు 9ఓవర్లలోనే 45పరుగులు జోడించారు. డకెట్‌ను బుమ్రా ఔట్ చేయగా... క్రాలేను అశ్విన్ పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత జో రూట్ (2), జానీ బెయిర్ స్టో(10), బెన్ స్టోక్స్(6) తక్కువ పరుగులకే పెవీలియన్‌కు చేరారు. 54 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేసిన పోప్.. 154 బంతుల్లో సెంచరీ కొట్టాడు. రెండో సెషన్‌లో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ వికెట్ కోల్పోయాక మరింత జాగ్రత్తగా ఆడాడు. స్టోక్స్‌తో ఆరో వికెట్‌కు 112 పరుగులు జోడించాడు. అక్షర్ పటేల్ బౌలింగ్‌లో స్టోక్స్ ఔటయ్యాక రెహాన్‌తో కలిసి ఇంగ్లండ్ స్కోరుబోర్డును పరుగులు పెట్టిస్తున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో పిచ్ బౌలర్లకు అనుకూలించే ఛాన్స్ ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోర్ 7వికెట్ల నష్టానికి 421పరుగులతో మూడోరోజు ఆట కొన సాగించిన భారత్ మరో 15 పరుగులు జోడించి మిగిలిన మూడు వికెట్లు కోల్పోయింది. దీంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 436 పరుగులు చేసింది.

స్కోర్‌బోర్డు..

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ : 246ఆలౌట్
ఇండియా తొలి ఇన్నింగ్స్ : 436ఆలౌట్

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ : క్రాలే (సి)రోహిత్ (బి)అశ్విన్ 31, డకెట్ (బి)బుమ్రా 47, పోప్ (బ్యాటింగ్) 148, రూట్ (ఎల్‌బి)బుమ్రా 2, బెయిర్‌స్టో (బి)జడేజా 10, స్టోక్స్ (బి)అశ్విన్ 6, ఫోక్స్ (బి)అక్షర్ 34, రెహాన్ అహ్మద్ (బ్యాటింగ్) 16, అదనం 22. (77ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 316పరుగులు. **వికెట్ల పతనం:** 1/45, 2/113, 3/117, 4/140, 5/163, 6/275 **బౌలింగ్:** బుమ్రా 12-3-29-2, అశ్విన్ 21-3-93-2, అక్షర్ పటేల్ 15-2-69-1, జడేజా 26-1-101-1, సిరాజ్ 3-0-8-0

ఇన్నింగ్స్ తేడాతో హైదరాబాద్ గెలుపు..

హైదరాబాద్: హైదరాబాద్ వేదికగా ప్లేట్ గ్రూప్‌లో అరుణాచల్‌ప్రదేశ్‌తో జరుగుతున్న రంజీట్రోఫీలో హైదరాబాద్ జట్టు ఇన్నింగ్స్ 187పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోర్ వికెట్ నష్టానికి 529పరుగులతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ జట్టు 4వికెట్ల నష్టానికి 615పరుగుల వద్దవిన్నింగ్స్ డిక్లేర్డ్ చేసింది. దీంతో 443పరుగులు వెనుకబడి రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన అరుణాచల్‌రపదేశ్ జట్టు 256పరుగులకు ఆలౌటైంది. దివ్యాంషు)91), డోరియ(51) అర్ధసెంచరీలతో రాణించగా.. హైదరాబాద్ బౌలర్లు సాయిరాం, త్యాగరాజన్‌కు మూడేసి వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో అరుణాచల్‌ప్రదేశ్ జట్టు 172పరుగులకే కుప్పకూలిన సంగతి తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68